# ప్రజా [illegible]

తెలంగాణ జాతీయ దినపత్రిక

ఎడిటర్ : సిహెచ్.వి. ప్రభాకర్ రావు





2026 టీ20 ప్రపంచకప్ భారత్‌లో ఆడేది లేదన్న బంగ్లా.. మద్దతుగా ఐసీసీకి పాక్ లేఖ..!


ప్రచురణ : జగిత్యాల సంపుటి : 05 సంచిక : 196 పేజిలు : 04 వెల రూ. 2 గురువారం 22 - 01 - 2026


## దిగ్గజ సంస్థల చూపు
# తెలంగాణ వైపు

- దావోస్‌లో సీఎం రేవంత్ రెడ్డితో అంతర్జాతీయ కంపెనీల ప్రతినిధుల భేటీ
- దావోస్‌లో తెలంగాణ రైజింగ్ ప్రతినిధుల బృందం పర్యటన
- సాంకేతిక రంగాల్లో తెలంగాణ స్టార్టప్‌లకు మద్దతు ఇవ్వనున్న ఇజ్రాయెల్
- వివిధ రంగాల్లో తెలంగాణతో కలిసి పనిచేసేందుకు ముందుకొచ్చిన గూగుల్
- దావోస్ సదస్సు వేదికగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక ప్రతిపాదన
- ప్రపంచ ఆర్థిక సదస్సు ఫాలోఆప్ సదస్సును తెలంగాణలో నిర్వహించాలన్న ముఖ్యమంత్రి
- ప్రతి సంవత్సరం జులైలో హైదరాబాద్‌లో ఫాలోఅప్ సదస్సు నిర్వహించాలన్న సీఎం
- మద్దతు తెలిపిన ప్రముఖ వ్యాపారవేత్తలు, పాలసీ నిర్ణేతలు



హైదరాబాద్ : రాష్ట్రానికి పెట్టుబడులు ఆకర్షించడంతో పాటు తెలంగాణ రైజింగ్-2047 విజన్‌ను ప్రపంచానికి పరిచయం చేసే లక్ష్యంతో దావోస్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బృందం పర్యటనకొనసాగుతోంది. పారిశ్రామికవేత్తలతో వరససమావేశాలతో తొలిరోజు బిజీగాగడిపారు. రాష్ట్రంలో పెట్టుబడులకు పలుసంస్థలుముందుకొచ్చాయి. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌తో రాష్ట్రంలో పౌరసేవలను మరింత సమర్థవంతంగా నిర్వహించనున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దావోస్ వేదికగా తెలిపారు. దావోస్‌లో ప్రపంచ ఆర్థిక ఫోరం వార్షికసదస్సుకి వెళ్లిన తెలంగాణ రైజింగ్ ప్రతినిధులు మొదటి రోజున బిజీబిజీగా గడిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బృందానికి జ్యూరిచ్ విమానాశ్రయంలో స్విట్జర్లాండ్‌లోని భారతరాయబారి మృదుల్ కుమార్‌తో పాటు ప్రవాస తెలంగాణ వాసులు ఘనస్వాగతం పలికారు. - మిగతా 2 లో

## కేటీఆర్ అలా చెబుతుంటే నవ్వు వచ్చింది

- తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత
- సోదరుడిపై కవిత విమర్శలు
- సికింద్రాబాద్‌ను జిల్లాగా చేయమని కేటీఆర్ డిమాండ్ చేయడంపై విమర్శ
- పదేళ్ల అధికారంలో ఉండి సికింద్రాబాద్ కోసం ఉద్యమించిన వారిని జైల్లో వేశారని ఆరోపణ
- ఈరోజు కేటీఆర్ జిల్లాగా చేయాలని డిమాండ్ చేస్తుంటే నవ్వు వస్తోందని వ్యాఖ్య



హైదరాబాద్ : తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత తన సోదరుడు, బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై విమర్శలు చేశారు. సికింద్రాబాద్‌ను జిల్లాగా చేయాలని కేటీఆర్ డిమాండ్ చేసిన విషయం తెలిసిందే. మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించిన 'సేవ్ సికింద్రాబాద్' ర్యాలీకి కేటీఆర్ మద్దతు తెలిపారు. సికింద్రాబాద్‌ను జిల్లాగా చేయాలన్న కేటీఆర్ డిమాండ్‌పై కవిత స్పందిస్తూ, "కేటీఆర్ సికింద్రాబాద్‌ను జిల్లాగా చేయాలని ఉద్యమిస్తుంటే నాకు నవ్వు వస్తోంది. సికింద్రాబాద్‌ను జిల్లాగా చేయాలని డిమాండ్ చేసిన వారిని పదేళ్ల అధికారంలో ఉన్నప్పుడు అణిచివేశారు, - మిగతా 2 లో

2 లో

## మున్సిపల్ ఎన్నికలకు ముందు 47 మంది కమిషనర్ల బదిలీ

ఎస్ఈసీ మార్గదర్శకాల మేరకు కమిషనర్లను బదిలీ చేస్తూ పురపాలక శాఖ ఉత్తర్వులు

సొంత జిల్లాల్లో పని చేస్తున్నవారు, ఒకేచోట సుదీర్ఘకాలం పని చేస్తున్న వారు బదిలీ

బదిలీ అయిన అధికారులు వెంటనే బాధ్యతలు స్వీకరించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్న ప్రభుత్వం



2 లో

## ఫేక్ ఔట్ లెట్ ను ప్రారంభించిన పాక్ రక్షణ మంత్రి

సియాల్ కోట్ లో ఘనంగా పిజ్జా హట్ ఔట్ లెట్ ప్రారంభోత్సవం..

రిబ్బన్ కట్ చేసిన మంత్రి

అది ఫేక్ ఔట్ లెట్ అని, దాంతో తమకు సంబంధంలేదంటూ పిజ్జా హట్ వివరణ

ప్రపంచంలో పాక్ కు మాత్రమే ఇలాంటి పనులు సాధ్యమని నెటిజన్ల సెటైర్

## గ్రీన్‌ల్యాండ్ మంచు కింద
# అమెరికా రహస్య స్థావరం

- నాసా రాడార్‌లో గుర్తింపు
- గ్రీన్‌ల్యాండ్ మంచు కింద బయటపడ్డ అమెరికా రహస్య సైనిక స్థావరం
- నాసా రాడార్ స్కానింగ్‌లో అనూహ్యంగా గుర్తింపు
- ప్రచ్ఛన్న యుద్ధ కాలంలో 'ప్రాజెక్ట్ ఐస్‌వర్మ్' కింద నిర్మాణం
- 'మంచు కింద నగరం'గా పిలిచే ఈ బేస్‌లో అణు క్షిపణుల నిల్వకు ప్లాన్
- వాతావరణ మార్పులతో వ్యర్థాలు బయటపడతాయని శాస్త్రవేత్తల ఆందోళన




ఢిల్లీ : ప్రచ్ఛన్న యుద్ధ కాలంలో అమెరికా అత్యంత రహస్యంగా నిర్మించిన సైనిక స్థావరం ఒకటి దశాబ్దాల తర్వాత మళ్లీ వెలుగులోకి వచ్చింది. గ్రీన్‌ల్యాండ్ మంచు పొరల కింద కూరుకుపోయిన 'క్యాంప్ సెంచరీ' అనే ఈ బేస్‌ను నాసా శాస్త్రవేత్తలు ఇటీవల రాడార్ స్కానింగ్‌లో అనూహ్యంగా గుర్తించారు. ఇది ఒక సాధారణ శాస్త్రీయ పరిశోధనలో భాగంగా జరిగిన ఆకస్మిక ఆవిష్కరణ కావడం విశేషం. ఈ ఏడాది ఏప్రిల్‌లో, నాసా శాస్త్రవేత్తలు గల్ఫ్‌స్ట్రీమ్ విమానంలో ఉత్తర గ్రీన్‌ల్యాండ్‌పై ప్రయాణిస్తుండగా ఈ ఘటన జరిగింది. అధునాతన రాడార్ వ్యవస్థను పరీక్షిస్తున్నప్పుడు, పిటుఫిక్ స్పేస్ బేస్‌కు సుమారు 200 కిలోమీటర్ల దూరంలో మంచు కింద - మిగతా 2 లో

## చరిత్రలో తొలిసారిగా రికార్డు స్థాయిలో రూపాయి పతనం



- డాలర్‌తో పోలిస్తే రికార్డు కనిష్ఠానికి పడిపోయిన రూపాయి
- ఒక దశలో 91.74 స్థాయికి చేరిన మారకం విలువ
- బంగారం, వెండి దిగుమతులు పెరగడం ఒక కారణం
- దేశీయ మార్కెట్ల నుంచి విదేశీ పెట్టుబడుల తరలింపు ప్రభావం
- అంతర్జాతీయ వాణిజ్య యుద్ధ భయాలు కూడా పతనానికి మరో కారణం

ఢిల్లీ : అమెరికా డాలర్‌తో పోలిస్తే భారత రూపాయి మారకం విలువ చరిత్రాత్మక కనిష్ఠ స్థాయికి పడిపోయింది. ఇవాళ ట్రేడింగ్‌లో రూపాయి భారీగా నష్టపోయి, ఒక దశలో 91.74 వద్ద ఆల్ టైమ్ కనిష్ఠాన్ని నమోదు చేసింది. మార్కెట్‌లో నెలకొన్న పలు ప్రతికూల పరిణామాల మధ్య ఒక్కరోజే 77 పైసల మేర విలువను కోల్పోయింది. - మిగతా 2 లో




## చిత్తశుద్ధితో కష్టపడి పని చేస్తే
# ఏదైనా సాధ్యం

- ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు
- అనుమతుల నుంచి పరిశ్రమల స్థాపన వరకు రియల్ టైంలో మానిటర్
- మూడో రోజు దావోస్‌లో పర్యటిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు
- చంద్రబాబుతో వివిధ జాతీయ, అంతర్జాతీయ మీడియా ప్రతినిధుల ఇష్టాగోష్ఠి
- భారీ లక్ష్యాలు నిర్దేశించుకుని వాటి కోసం నిరంతరం పని చేయడం తనకు అలవాటు అని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం
- చిత్తశుద్ధితో, కష్టపడి పని చేస్తే ఏదైనా సాధ్యం అని నమ్ముతానని ఉద్ఘాటించారు
- అనుమతుల నుంచి పరిశ్రమల స్థాపన వరకు ప్రతి అంశాన్ని రియల్ టైంలో మానిటర్ చేస్తున్నామని వివరించారు



అమరావతి : భారీ లక్ష్యాలు నిర్దేశించుకుని వాటి కోసం నిరంతరం పని చేయడం తనకు అలవాటు అని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. ముందుచూపుతో వ్యవహరించి వినూత్నంగా ఆలోచించి చిత్తశుద్ధితో, కష్టపడి పని చేస్తే ఏదైనా సాధ్యం అని నమ్ముతానని ఉద్ఘాటించారు. ప్రపంచ ఆర్థిక సదస్సులో భాగంగా దావోస్‌లో మూడో రోజు ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యటిస్తున్నారు. పర్యటనలో భాగంగా ముఖ్యమంత్రి చంద్రబాబుతో వివిధ జాతీయ, అంతర్జాతీయ మీడియా ప్రతినిధులు సంభాషించారు. టైమ్ మీడియా ప్రతినిధి టిమ్ హోవాట్, బ్లూమ్‌బెర్గ్ ప్రతినిధి జీనెత్ రోడ్రిగ్స్, బిజినెస్ టుడే ప్రతినిధి ఆలోక్ నాయర్, ఎన్డీటీవీ నుంచి ఆయుష్ ఐలావాదిలతో ఇష్టాగోష్టిలో సీఎం పాల్గొన్నారు. రాష్ట్రంలో పారిశ్రామికాభివృద్ధి విషయంలో జరుగుతున్న పరిణామాలను, ప్రభుత్వ పాలసీలను మీడియా ప్రతినిధులకు సీఎం చంద్రబాబు - మిగతా 2 లో




2 లో

## దావోస్‌లో వ్యాపార దిగ్గజాలతో లోకేశ్ చర్చలు

- ఏపీకి రావాలంటూ ఫిన్‌టెక్, ఏఐ, గ్రీన్ ఎనర్జీ సంస్థలకు ఆహ్వానం
- దావోస్‌లో ప్రపంచ ఆర్థిక వేదిక సదస్సులో మంత్రి లోకేశ్ బిజీబిజీ
- విశాఖలో టెక్నాలజీ డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటుకు జెరోధాకు ప్రతిపాదన
- గ్రీన్ అమ్మోనియా ఉత్పత్తి కేంద్రాలపై జపాన్ సంస్థ 'జెరా'తో కీలక చర్చలు
- విశాఖలో ఏఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటు చేయాలని స్కేల్ ఏఐకి ఆహ్వానం
- ప్రతిపాదనలను పరిశీలిస్తామని సానుకూలంగా స్పందించిన గ్లోబల్ కంపెనీలు

# సంపాదకీయం

## కరుణ ముఖ్యం

ఒక రైతు పెంచుకుంటున్న కుక్క ఆ రోజు కనపడలేదు. ఇంటికి రాలేదు. రైతు వెతకబోయే వేళకు చీకటి పడిపోయింది. రైతు విలవిలలాడిపోయాడు. రైతుకూ కుక్కకూ ఉన్న అనుబంధం గ్రామస్థులకు తెలుసు. రాత్రంతా జాగారం చేస్తున్న రైతు బాధ గమనించి తెల్లవారుతూనే రైతుకు సాయంగా కుక్కను వెతక బయలుదేరారు. వెళ్లగా వెళ్లగా వంతెన కింద మట్టిలో కుక్క పడుకుని కనిపించింది. వంతెన మీద నుంచి గ్రామస్థులు ఎంత పిలిచినా అది లేచి రాలేదు. ఏమై ఉంటుందా అని గ్రామస్థులు వంతెన దిగి కుక్క దగ్గరకు వెళితే అక్కడ కుక్క కుక్కలా లేదు. వెచ్చటి రగ్గులా ఉంది. ఎవరిదో తెలియని కుక్కపిల్ల చలికి వణుకుతూంటే దాని ఒళ్లు వెచ్చబెట్టేందుకు రాత్రంతా ఇంటికి రాకుండా కరుణతో కాపాడుతూ ఉంది. గ్రామస్థులు ఆ దృశ్యాన్ని చూస్తూ నిలబడ్డారు. దీనికి ఉన్న కరుణ మనిషికి ఎందుకు లేదు?దేశంలో ఈ గడ్డకట్టే చలిగాలుల్లో, నెత్తి మీద కాసింత నీడ లేక, ఉత్తబిత్తల ఆకాశం కింద, తోచిన గుడ్డ కప్పుకుని వేలాదిమంది అభాగ్యులు రాత్రుళ్లు దయనీయంగా పడు కుని ఉన్న దృశ్యాలు మీడియాలో వస్తున్న వేళ 'జైపూర్ లిటరేచర్ ఫెస్టివల్'లో నోబెల్ శాంతి విజేత 'లైమా గ్బవీ' తమ ఆఫ్రికా దేశపు కథను చెప్పడం కేవలం యాదృచ్ఛికం. ఆమె చెప్పిన కథకు కొనసాగింపుగా మరో నోబెల్ శాంతి విజేత కైలాశ్ సత్యార్థి తన జీవితంలో ఎదురైన ఘటనను చెప్పుకొచ్చారు చాలా ఏళ్ల కిందటి మాట. ఒక తండ్రి నా తలుపు తట్టాడు. అయ్యా... నా కూతురిని రక్షించు అన్నాడు. అప్పుడు చిన్న పత్రికను నడుపుతున్నాను. ఉత్తరప్రదేశ్ నుంచి పంజాబ్‌కు 30 కుటుంబాలు పనికి వెళితే వారిని కట్టు బానిసలుగా చేశారనీ, మహిళలు, చిన్న పిల్లలు ఉన్నారనీ, తన కూతురు వయసుకు రావడం చూసి అమ్మేయబోతున్నారనీ, పోలీసులు సాయానికి రాకపోవడం వల్ల పత్రికలో రాస్తే ఏదైనా ప్రయోజనం ఉంటుందని వచ్చాననీ ఆ తండ్రి నాతో ఏడుస్తూ చెప్పాడు. పత్రికలో ఆ విషయం రాయడానికి కూచుని వెంటనే పెన్సిల్ పక్కన పడేశాను. అక్కడ ఉన్నది నా కూతురో, చెల్లెలో అయితే ఇలా వ్యాసం రాస్తూ కూచుంటానా? అనుకున్నాను. ఆ తర్వాత నా తల పగిలి ఉండొచ్చు. వెన్నుపూసను విరిచినంత పని చేసి ఉండొచ్చు. నా కాలిని విరగ్గొట్టి ఉండొచ్చు. కాని ఇప్పటికి లక్షా ముప్పైం వేల మంది అలాంటి పిల్లలను కాపాడాను. వారి ఆనంద బాష్పాలలో నేను దేవుణ్ణి చూశాను. కరుణే నాకు ఇంత శక్తి ఇచ్చిందని అనుకుంటున్నాను.'మనిషి మంచివాడే. నాగరికత వల్ల చెడిపోయాడు' అన్నాడు రూసో. నాగరికత అంటే గాలి కూడా పీల్చడానికి వీల్లేనంతగా అభివృద్ధి చెందడం కాబోలు! మరి చెడి పోవడం అంటే? కరుణ అడుగంటిన వాడు అవడమే! కరుణ లేకపోతే ఏమవుతుంది? పీడన, పెత్తనం, చెడు, దుర్మార్గం, నిస్సహాయత, హింస, దౌర్జన్యం... కళ్ల ముందు కని పిస్తున్నా చలించని జడత్వం వస్తుంది. జడత్వం రాయి. కరుణ జల. తల్లిదండ్రులకు తమ పిల్లల ఐ.క్యూ (ఇంటెలిజెన్స్ కోషియెంట్) బాగుండాలని ఉంటుంది. కాని పిల్లల్లో చూడాల్సింది, పాదుకొనేలా చేయాల్సింది సి.క్యూ. అంటే 'కంప్యాషన్ కోషియెంట్'. ఇది ఎంత ఎక్కువ ఉంటే అంత సంతోషపడాలి. చీకట్లో నల్లపూస దొరకగలదేమోగానీ నేటి మనిషిలో కరుణ దొరకడం దుర్లభం అవుతోంది.అందుకే మనిషికి ఇంకో మనిషి, వర్గం, ప్రాంతం, కులం, మతం... అన్నింటి పట్లా విరోధభావం, శత్రుత్వం. తుదకు పశుజాలం పట్ల కూడా మనిషి కరుణ చూపడం లేదు. మనిషికి కరుణ ఉంటే నదులు, పర్వతాలు, అడవులు ఇలా ఉండేవా? అన్నారు కైలాశ్ సత్యార్థి. అందుకే మనిషిలో 'సి.క్యూ' కొలవగలిగే యాప్‌ను కనిపెట్టాలి. అది ఎక్కువ కలిగిన వారినే వివాహానికి, ఉద్యోగానికి, రాజకీయ పదవులకి ఎన్నుకోవాలి. స్కిల్స్ పెంచుకోవడానికి శిక్షణ ఇచ్చినట్టే కరుణ పెంచుకోవడానికి శిక్షణ ఇవ్వాలి అన్నారు సత్యార్థి.జైపూర్ లిటరేచర్ ఫెస్టివల్‌లో ఆయన తాజా పుస్తకం 'కరుణ: ది పవర్ ఆఫ్ కంప్యాషన్' ఆవిష్కరణ వేడుకలో ఇంటిని, కుటుంబాన్ని, సరిహద్దులను దాటి ప్రపంచ వ్యాప్తంగా అందరికీ చేరగల కరుణ అవసరం గురించి ఇలాంటి మాటలెన్నో సాగాయి. 'త్రుంచ బోకుము... తల్లికి బిడ్డకు వేరు చేతువే' అని విలపించిన కరుణశ్రీ నడిచిన తెలుగు నేలకు కరుణ తెలియదా ఏమి? కాకుంటే కాస్త మరుగున పడి ఉంటుంది, మరుపున అణిగి ఉంటుంది అంతే!

## గ్రీన్‌ల్యాండ్ మంచు కింద అమెరికా రహస్య స్థావరం

**మొదటిపేజీ తరువాయి –** సహజత్వానికి భిన్నంగా, సరళ రేఖల్లో ఉన్న నిర్మాణాలను రాడార్ సిగ్నల్స్ పసిగట్టాయి. చారిత్రక మ్యాపులతో సరిపోల్చగా, అది 'క్యాంప్ సెంచరీ' అని నిర్ధారించుకున్నారు.1959లో అమెరికా ఆర్మీ ఇంజినీర్లు ఈ బేస్‌ను నిర్మించారు. 'మంచు కింద నగరం' అని పిలిచే ఈ స్థావరం కోసం మంచులో 8 మీటర్ల లోతున సొరంగాలు తవ్వి, పైన మంచుతో కప్పేశారు. సుమారు 200 మంది సిబ్బంది నివసించేలా ల్యాబొరేటరీలు, నివాస గృహాలు నిర్మించారు. దీనికి పోర్టబుల్ న్యూక్లియర్ జనరేటర్‌తో విద్యుత్‌ను అందించేవారు. వాస్తవానికి ఇది 'ప్రాజెక్ట్ ఐస్‌వర్మ్' అనే రహస్య ప్రణాళికలో భాగం. సోవియట్ యూనియన్‌ను లక్ష్యంగా చేసుకుని అణు క్షిపణులను ఇక్కడ దాచి ఉంచాలన్నది అమెరికా వ్యూహం.అయితే, మంచు కదలికలు ఊహించిన దానికంటే వేగంగా ఉండటంతో ఈ ప్రాజెక్టు సురక్షితం కాదని భావించి, 1967 నాటికి దీన్ని పూర్తిగా వదిలేశారు. కాలక్రమేణా మంచు పేరుకుపోవడంతో, ప్రస్తుతం ఈ స్థావరం అవశేషాలు సుమారు 30 మీటర్ల (100 అడుగులు) లోతులో కూరుకుపోయి ఉన్నాయి.అణు రియాక్టర్‌ను తొలగించినప్పటికీ, రసాయనిక, జీవ, రేడియోధార్మిక వ్యర్థాలు అక్కడే మిగిలిపోయాయి. వాతావరణ మార్పులతో మంచు కరుగుతున్న నేపథ్యంలో, భవిష్యత్తులో ఈ వ్యర్థాలు బయటపడి పర్యావరణానికి ముప్పుగా మారవచ్చని శాస్త్రవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

## చరిత్రలో తొలిసారిగా రికార్డు స్థాయిలో రూపాయి పతనం

**మొదటిపేజీ తరువాయి –** 90.97 వద్ద ముగిసిన రూపాయి, ఇవాళ ఉదయం 91.05 వద్ద బలహీనంగా ప్రారంభమైంది. ట్రేడింగ్ సాగుతున్న కొద్దీ అమ్మకాల ఒత్తిడి పెరగడంతో రూపాయి విలువ అంతకంతకూ దిగజారింది. బంగారం, వెండి దిగుమతులు పెరగడం, విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు దేశీయ మార్కెట్ల నుంచి తమ పెట్టుబడులను భారీగా ఉపసంహరించుకోవడం పతనానికి ప్రధాన కారణంగా నిలిచింది.మరోవైపు అమెరికా, యూరప్ మధ్య వాణిజ్య యుద్ధ భయాలు, గ్రీన్‌లాండ్‌ను స్వాధీనం చేసుకునేందుకు అమెరికా ప్రయత్నిస్తోందన్న వార్తలు వంటి అంతర్జాతీయ అంశాలు కూడా రూపాయిపై తీవ్ర ఒత్తిడిని పెంచాయి. వీటికి తోడు దేశీయ స్టాక్‌మార్కెట్లు నష్టాల్లో కొనసాగడం రూపాయి విలువను మరింత బలహీనపరిచిందని మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి.

## కేటీఆర్ అలా చెబుతుంటే నవ్వు వచ్చింది

**మొదటిపేజీ తరువాయి –** జైళ్లలో వేశారు. కానీ, ఇప్పుడు కేటీఆర్ వెళ్లి సికింద్రాబాద్‌ను జిల్లాగా చేయమని మాట్లాడుతున్నారు" అని విమర్శించారు.

**మున్సిపల్ ఎన్నికల్లో పోటీపై కవిత స్పష్టత**

రానున్న మున్సిపల్ ఎన్నికల్లో తెలంగాణ జాగృతి పోటీ చేసే విషయమై కవిత మాట్లాడుతూ, జాగృతి ఇంకా పూర్తిస్థాయి రాజకీయ పార్టీగా మారలేదని, అందుకే మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేయడం లేదని అన్నారు. అయితే, ఎన్నికల్లో మద్దతు కావాలని బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, యువత, మహిళలు కోరితే అండగా నిలబడతామని హామీ ఇచ్చారు. రాజకీయాల్లోకి రావాలనుకునే వారు మున్సిపల్ ఎన్నికలను ఉపయోగించుకోవాలని సూచించారు. ముఖ్యంగా మహిళలు, యువత, బీసీలు, ఎస్సీ, ఎస్టీలు రాజకీయాల్లోకి రావాలని ఆమె పిలుపునిచ్చారు.

## మున్సిపల్ ఎన్నికలకు ముందు 47 మంది కమిషనర్ల బదిలీ

**మొదటిపేజీ తరువాయి –** 2026 మున్సిపల్ ఎన్నికలకు ముందు తెలంగాణ ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా 47 మంది మున్సిపల్ కమిషనర్లను బదిలీ చేసింది. నిష్పాక్షికంగా ఎన్నికల నిర్వహిం చేందుకు జీహెచ్‌ఎంసీ, కార్పొరేషన్లు, మున్సిపాలిటీలలో ఈ బదిలీలు చేపట్టింది. ఈ మేరకు పురపాలక శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. త్వరలో రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఎస్‌ఈసీ మార్గదర్శకాల మేరకు కమిషనర్లను బదిలీ చేస్తూ పురపాలక శాఖ ఉత్తర్వులు ఇచ్చింది.సొంత జిల్లాల్లో పనిచేస్తున్న వారు, ఒకేచోట సుదీర్ఘ కాలం పనిచేస్తున్న అధికారులను పరిపాలనాపరమైన కారణాలతో పాటు పదోన్నతులపై బదిలీ చేసింది.సి.వి.ఎన్. రాజు ఆదిలాబాద్ మున్సిపల్ కమిషనర్ (గ్రేడ్-3) నుంచి రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ సెక్రటరీగా బదిలీ అయ్యారు. జి.రాజు క్యాతనపల్లి నుంచి ఆదిలాబాద్ మున్సిపాల్ కమిషనర్‌గా, ముసాబ్ అహ్మద్ నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్ నుంచి హుజూరాబాద్ మున్సిపల్ కమిషనర్‌గా, బి.శ్రీనివాస్ ఆలేరు నుంచి హుజూర్ నగర్ మున్సిపల్ కమిషనర్‌గా బదిలీ అయ్యారు. బి.శరత్ చంద్ర ప్రమోషన్‌పై నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా వెళ్లనున్నారు. బదిలీ అయిన అధికారులు వెంటనే తమకు కేటాయించిన కొత్త ప్రాంతాల్లో బాధ్యతలు స్వీకరించాలని ప్రభుత్వం ఉత్తర్వుల్లో పేర్కొంది.

## చిత్తశుద్ధితో, కష్టపడి పని చేస్తే ఏదైనా సాధ్యం

**మొదటిపేజీ తరువాయి –** వివరించారు. తమది పరిశ్రమల ఫ్రెండ్లీ గవర్నమెంట్ అని, ఈజ్ ఆఫ్ నుంచి స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానం ద్వారా త్వరితగతిన అనుమతులిస్తున్నామని వెల్లడించారు. పరిశ్రమలకు ఎస్క్రో ఖాతా ద్వారా ప్రోత్సాహకాలిచ్చే విధానాన్ని అమలు చేస్తున్నట్లు తెలిపారు. అనుమతుల నుంచి పరిశ్రమల స్థాపన వరకు ప్రతి అంశాన్ని రియల్ టైంలో మానిటర్ చేస్తున్నామని వివరించారు. పరిశ్రమలకు వేగంగా అనుమతు వ్వడంతోపాటు, ఉత్పత్తి వేగంగా జరిగేలా చర్యలు తీసుకుంటు న్నామన్నారు. విశాఖకు గూగుల్ కంపెనీ రాక ఏపీ అభివృద్ధిలో గొప్ప ముందడుగు అని గుర్తు చేశారు. రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి లోకేశ్ ఈ విషయంలో చూపిన చొరవ, ఫాలో అప్ వల్లే ఆ పెట్టుబడి సాధించామని చంద్రబాబు తెలిపారు. వ్యవసాయంలో టెక్నాలజీ వినియోగంతో పరిస్థితులు పూర్తిగా మారుతున్నాయని చెప్పారు. రాష్ట్రంలో అగ్రిటెక్ విధానాన్ని అమలు చేస్తున్నమన్నారు. గ్రీన్ ఎనర్జీ, గ్రీన్ అమ్మోనియా గురించి అంతా చర్చిస్తున్న సమయంలోనే ఆంధ్రప్రదేశ్‌లో ఉత్పత్తికి అడుగులు వేసి, పరిశ్రమ నిర్మిస్తున్నట్లు



తెలిపారు.విదేశాలకు గ్రీన్ అమ్మోనియా ఉత్పత్తి ఎగుమతి చేసేందుకు ఇప్పటికే ఒప్పందాలు జరిగాయని చంద్రబాబు వివరించారు. 30 ఏళ్ల క్రితం దేశ అభివృద్ధిలో కీలక అడుగులు పడ్డాయన్న చంద్రబాబు, ఇప్పుడు సంస్కరణలను అందిపుచ్చుకుం టున్నామ న్నారు. ఆ సంస్కరణలే రాష్ట్రంలోని యువతకు అవకాశాలు కల్పించాయని వెల్లడించారు. టెక్నాలజీ, గ్రీన్-బ్లూ సిటీగా అమరావతి నిర్మిస్తున్నామని తెలిపారు.ఏపీలో గ్లోబల్ లీడర్ షిప్ సెంటర్ ఏర్పాటు చేయాలనేది తన ఆలోచన అని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఏపీ అమలు చేస్తున్న విధానాలను, వేగంగా తీసుకుంటున్న నిర్ణయాలను జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు లభిస్తోందని తెలిపారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పారిశ్రామిక రంగం ఏపీ గురించి చర్చించుకుంటోందన్నారు. చైనా, జపాన్ సహా అనేక దేశాల్లో ఉన్న ఏజింగ్ సమస్య భారత దేశానికి లేదని వ్యాఖ్యానించారు. సమర్థ మానవ వనరులు, టెక్నాలజీ భారతదేశ అదనపు బలమని ధీమా వ్యక్తం చేశారు.మరోవైపు సైబర్ సెక్యూరిటీ నగరంగా రాజధాని అమరావతిని తీర్చిదిద్దేందుకు సాంకేతిక సహకారం అందించాలని ఇజ్రాయెల్ ప్రతినిధులను సీఎం చంద్రబాబు కోరారు. ఇజ్రాయెల్ వాణిజ్య, పరిశ్రమల మంత్రి నిర్ బర్కత్, ఆ దేశ ట్రేడ్ కమిషనర్ రోయ్ పిషర్‌తో సీఎం సమావేశమ య్యారు. విశాఖ- చెన్నై కారిడార్లో యూఏవీ డ్రోన్ల తయారీ, తీరప్రాంత గస్తీ, వ్యవసాయ రంగంలో వినియోగానికి డ్రోన్ల తయారీ, వ్యర్థ జలాల రీసైక్లింగ్ సాంకేతికతపై సహకారాన్ని అందించాలని చంద్రబాబు విజ్ఞప్తి చేశారు.

## రాజధానిగా అమరావతికి చట్టబద్ధత పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల్లో బిల్లు!

**మొదటిపేజీ తరువాయి –** రాజధానిగా అమరావతిని ప్రకటించాలని కేంద్రానికి రాష్ట్ర ప్రభుత్వం నివేదించింది. రాజధాని ఎంపిక ప్రక్రియ, నిర్మాణాలపై కేంద్రానికి నోట్ అందజేసింది. ఏ తేదీ నుంచి రాజధానిగా ప్రకటించాలో కేంద్ర హోంశాఖ చెప్పాలంది.2024 జూన్ 2 నుంచే రాజధానిగా ప్రకటించాలని రాష్ట్ర ప్రభుత్వం విజ్ఞప్తి చేసింది. సంబంధిత కేంద్ర శాఖల నుంచి హోంశాఖ అభిప్రాయాలు కోరడంతో పలు మంత్రిత్వ శాఖలు ఇప్పటికే తమ అభిప్రాయాలు వ్యక్తపరిచాయి. పట్టణాభివృద్ధి, న్యాయ శాఖలు ఇంకా అభిప్రాయాలు చెప్పాల్సి ఉంది. ఈ బడ్జెట్ సమావేశాల్లోనే రాజధాని ప్రకటించేందుకు చర్యలు తీసుకున్నట్లు తెలుస్తోంది. పార్లమెంటులో బిల్లు ప్రవేశపెట్టే ముందు కేబినెట్‌లో చర్చించి ఆమోదించనున్నట్లు తెలిసింది. ఈ మేరకు కేబినెట్ నోట్ తయారీలో హోంశాఖ నిమగ్నమైనట్లు అధికారులు వెల్లడించారు.రాజధాని అమరావతి నిర్మాణానికి 29 గ్రామాల రైతులు ముందుకొచ్చి 34వేల ఎకరాలు స్వచ్ఛందంగా ఇచ్చారు. సింగపూర్ ప్రభుత్వ సహకారంతో మాస్టర్‌ప్లాన్ రూపొందించారు. తెలుగుదేశం పార్టీ ప్రభుత్వ హయాంలోనే అక్కడ అసెంబ్లీ, సచివాలయ భవనాలు నిర్మించి పాలన ప్రారంభించారు. పెద్దఎత్తున రహదారులు, భవనాల నిర్మాణం మొదలైంది. 2019లో వైఎస్సార్సీపీ అధికారంలోకి రావడంతో అమరావతి పనులు నిలిచిపోయాయి.నాటి సీఎం జగన్ మూడు రాజధానుల ప్రతిపాదన తెచ్చారు. 2024లో కూటమి అధికారంలోకి రావడంతో అమరావతికి మళ్లీ వెలుగులొచ్చాయి. రాజధాని నిర్మాణం కోసం రూ.58వేల కోట్లతో పనులు ప్రారంభించారు. అమరావతికి భవిష్యత్తులో ఇబ్బందులు ఎదురుకాకుండా విభజన చట్టంలో సవరణ చేసేలా చూస్తామని హామీ ఇచ్చారు. ఏపీ రాజధానిగా అమరావతిని నోటిఫై చేస్తూ పార్లమెంటు ద్వారా విభజన చట్టంలో సవరణ చేయాలని కేంద్రాన్ని కోరారు.

**అసలు రాష్ట్ర విభజన చట్టంలో ఏముందంటే:**

పార్ట్-2 కింద 5(1) : నిర్ణయించిన తేదీ నుంచి పదేళ్లకు మించకుండా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు ఉమ్మడి రాజధానిగా హైదరాబాద్ ఉంటుంది.

పార్ట్-2 కింద 5(2) : సబ్ సెక్షన్ 5(1)లో పేర్కొన్న గడువు ముగిసిన తర్వాత తెలంగాణ రాజధానిగా హైదరాబాద్ కొనసాగుతుంది. ఆంధ్రప్రదేశ్‌కు నూతన రాజధాని ఏర్పాటవుతుంది.

**రాజధానిగా అమరావతిని ఎలా నోటిఫై చేస్తారు:**

ఆంధ్రప్రదేశ్ నూతన రాజధానిగా అమరావతిని ప్రకటిస్తూ విభజన చట్టంలో సవరణ చేస్తారు.పార్ట్



2-5(2) సబ్‌సెక్షన్‌లో ఆంధ్రప్రదేశ్‌కు నూతన రాజధాని ఏర్పాటవుతుంది అనేచోట అమరావతి కేంద్రంగా ఆంధ్రప్రదేశ్‌కి నూతన రాజధాని ఏర్పాటైందని పేర్కొంటారు.ఇప్పటికే రాజధాని అమరావతి పనులు అత్యంత వేగంగా జరుగుతున్న సంగతి తెలిసిందే. దేశ విదేశాల నుంచి పెట్టుబడిదారులు వచ్చి ఇక్కడ తమ సంస్థల నిర్వహణకు ఎంఓయూలు చేసుకున్న సంగతి తెలిసిందే. డేటా సెంటర్ సహా ఎన్నో కంపెనీలు రానున్నాయి. ఇదిలా ఉండగా మరోవైపు రాజధాని అమరావతి నగర విస్తరణలో భాగంగా రెండో విడత భూసమీకరణకు యంత్రాంగం పకడ్బందీ కార్యాచరణ ప్రణాళిక రూపొందిస్తోంది. తుళ్లూరు మండలంలో 3 గ్రామాలు, పల్నాడు జిల్లా అమరావతి మండలంలో 4 గ్రామాల పరిధిలో రైతుల నుంచి భూమి సమీకరిస్తున్నారు.

## దావోస్‌లో వ్యాపార దిగ్గజాలతో లోకేశ్ చర్చలు

**మొదటిపేజీ తరువాయి –** ఆంధ్రప్రదేశ్‌కు భారీ పెట్టుబడులను ఆకర్షించడం, రాష్ట్రాన్ని టెక్నాలజీ, పునరుత్పాదక ఇంధన రంగాల్లో కీలక కేంద్రంగా మార్చడమే లక్ష్యంగా రాష్ట్ర ఐటీ, విద్య, ఆర్‌టీజీ శాఖల మంత్రి నారా లోకేశ్ స్విట్జర్లాండ్‌లోని దావోస్‌లో తన పర్యటనను వేగవంతం చేశారు. ప్రపంచ ఆర్థిక వేదిక (డబ్ల్యూఈఎఫ్) సదస్సులో భాగంగా ఆయన ఫిన్‌టెక్, గ్రీన్ ఎనర్జీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) రంగాలకు చెందిన ప్రపంచ ప్రఖ్యాత సంస్థల అధినేతలతో వరుస సమావేశాలు నిర్వహించారు. రాష్ట్రంలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలను వివరిస్తూ, స్పష్టమైన ప్రతిపాదనలతో వారిని ఏపీకి ఆహ్వానించారు. ప్రముఖ స్టాక్ బ్రోకింగ్ సంస్థ 'జెరోధా' ఫౌండర్ నిఖిల్ కామత్‌తో మంత్రి లోకేశ్ ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విశాఖపట్నాన్ని ఫిన్‌టెక్ హబ్‌గా తీర్చిదిద్దే ప్రణాళికలో భాగంగా అక్కడ ఒక టెక్నాలజీ డెవలప్‌మెంట్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని కోరారు. ప్లాట్‌ఫామ్ ఇంజనీరింగ్, బ్యాకెండ్ సిస్టమ్స్, ట్రేడింగ్ అల్గోరిథంలు, డేటా అనలిటిక్స్‌పై ఈ కేంద్రం దృష్టి సారించాలని సూచించారు. రాష్ట్రంలో స్టార్టప్ ఎకోసిస్టమ్‌ను బలోపేతం చేసేందుకు రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్‌తో భాగస్వామ్యం కావాలని, యువ పారిశ్రామికవేత్తలకు లీడ్ మెంటర్‌గా వ్యవహరించాలని ఆహ్వానించారు. అంతేకాకుండా, పాఠశాల స్థాయి నుంచే విద్యార్థుల్లో ఆర్థిక అక్షరాస్యతను పెంపొందించేందుకు దేశంలోనే తొలిసారిగా రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి ఒక ప్రత్యేక కార్యక్రమాన్ని రూపొంది ంచాలని విజ్ఞప్తి చేశారు. లోకేశ్ ప్రతిపాదనలపై స్పందించిన నిఖిల్ కామత్, వాటిని తప్పకుండా పరిశీలిస్తామని హామీ ఇచ్చారు.పునరుత్పాదక ఇంధన రంగంలో ప్రసిద్ధి చెందిన జపాన్ సంస్థ 'జెరా' గ్లోబల్ సీఈవో, ఛైర్మన్ యుకియో కానితో లోకేశ్ భేటీ అయ్యారు. ఏపీలోని మూలపేట, కృష్ణపట్నం, కాకినాడ పోర్టుల మౌలిక సదుపాయాలను సద్వినియోగం చేసుకొని, సమీప ప్రాంతాల్లో గ్రీన్ అమ్మోనియా ఉత్పత్తి కేంద్రాల్లో పెట్టుబడులు పెట్టాలని కోరారు. ఇక్కడ తయారైన లో-కార్బన్ అమ్మోనియాను జపాన్, ఇతర ఆసియా దేశాలకు ఎగుమతి చేసే అవకాశాలను ఆయన వివరించారు. పారిశ్రామిక అవసరాల కోసం రాయలసీమలో సౌర-పవన హైబ్రిడ్ ప్రాజెక్టులను అభివృద్ధి చేయాలని, అలాగే రాష్ట్రంలోని థర్మల్ ప్లాంట్లలో ఉద్గారాలను తగ్గించేందుకు ఏపీ జెన్‌కో, ఎన్టీపీసీలతో కలిసి పైలట్ ప్రాజెక్టులు చేపట్టాలని సూచించారు. దీనిపై యుకియో కాని సానుకూలంగా స్పందిస్తూ, భారత్‌లో గ్రీన్ హైడ్రోజన్, గ్రీన్ అమ్మోనియా వాల్యూ చైన్‌లను అభివృద్ధి చేయడంపై తాము దృష్టి సారించామని, ఏపీ ప్రభుత్వ ప్రతిపాదనలను పరిశీలిస్తామని తెలిపారు.ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రంగంలో అగ్రగామిగా ఉన్న 'స్కేల్ గ్లోబల్ మేనేజింగ్ డైరెక్టర్ ట్రెవర్ థాంప్సన్‌తోనూ మంత్రి లోకేశ్ చర్చలు జరిపారు. సుమారు 29 బిలియన్ డాలర్ల మార్కెట్ విలువ కలిగిన ఈ సంస్థ అమెరికా రక్షణ శాఖ, మెటా, మైక్రోసాఫ్ట్, గూగుల్ వంటి దిగ్గజాలకు సేవలంది స్తోంది. ఈ నేపథ్యంలో విశాఖపట్నంలో 'స్కేల్ ఏఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్'ను ఏర్పాటు చేయాలని లోకేశ్ ఆహ్వానించారు. ఆర్టీఐహెచ్ (రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్) భాగస్వామ్యంతో ఏఐ భద్రత, గవర్నె న్స్‌పై ఒక ల్యాబ్‌ను ఏర్పాటు చేయాలని, ప్రభుత్వ ఏఐ అప్లికేషన్ల కోసం తమ ప్లాట్‌ఫామ్‌ను అందించాలని కోరారు. రాష్ట్రంలో ఏఐ అక్షరాస్యతను పెంచే కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని విజ్ఞప్తి చేశారు. ఏపీ ప్రభుత్వ విజన్‌ను ప్రశంసించిన ట్రెవర్, పెట్టుబడి ప్రతిపాదనలను తమ బోర్డు దృష్టికి తీసుకెళ్లి పరిశీలిస్తామని చెప్పారు.

## ఫేక్ ఔట్ లెట్ ను ప్రారంభించిన పాక్ రక్షణ మంత్రి

**మొదటిపేజీ తరువాయి –** పాకిస్థాన్ మరోసారి నవ్వులపాలైంది. ప్రపంచవ్యాప్తంగా పేరొందిన పిజ్జా హట్ కు పాక్ లోని సియాల్ కోట్ లో ఓ ఔట్ లెట్ తెరుచుకుంది! ఏకంగా దేశ రక్షణమంత్రి దీనికి రిబ్బన్ కట్ చేసి ప్రారంభోత్సవం చేశారు. అట్టహాసంగా జరిగిన ఈ ప్రారంభోత్సవ వేడుకలకు సంబంధించిన వీడియోలు వైరల్ గా మారాయి. ఇందులో ట్విస్ట్ ఏంటంటే.. సియాల్ కోట్ లో ఓ ఔట్ లెట్ ప్రారంభిస్తున్నట్లు పిజ్జా హట్ యాజమాన్యానికే తెలియకపోవడం. ఈ వీడియోలపై పిజ్జా హట్ స్పందిస్తూ.. సియాల్ కోట్ లో తమ సంస్థ ఔట్ లెట్ ప్రారంభించలేదని, వైరల్ గా మారిన ఔట్ లెట్ ఫేక్ అని ఓ ప్రకటనలో వెల్లడించింది.

**అసలేం జరిగిందంటే..**

సియాల్ కోట్ లో పిజ్జా హట్ ఔట్ లెట్ ప్రారంభించాలని దేశ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ ను నిర్వాహకులు ఆహ్వానించారు. దీంతో వెనకాముందు చూసుకోకుండా ఆసిఫ్ అంగీకరించారు. మాటిచ్చినట్లే ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మంత్రిని పూలతో ఆహ్వానించిన నిర్వాహకులు.. అందంగా అలంకరించిన ఔట్ లెట్ కు రిబ్బన్ కట్ చేయించి ప్రారంభోత్సవం చేయించారు. ఈ ఫొటోలు, వీడియోలు నెట్టింట వైరల్ గా మారడంతో పిజ్జా హట్ యాజమాన్యం స్పందించింది.

**పిజ్జా హట్ ఫిర్యాదు :** మంత్రి ఖవాజా ఆసిఫ్ ప్రారంభించిన ఔట్ లెట్ తమది కాదని, తమ బ్రాండ్ నేమ్ వాడుకుంటూ తెరిచిన ఫేక్ ఔట్ లెట్ అని స్పష్టం చేసింది. ఈ మేరకు అధికారికంగా ఓ ప్రకటన జారీ చేసింది. తమ ట్రేడ్‌మార్క్‌ను దుర్వినియోగం చేసి, అక్రమంగా తమ పేరు వాడుకుంటున్నారని సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినట్లు వెల్లడించింది. ఈ విషయం గమనించాలంటూ తమ కస్టమర్లకు సూచనలు చేసింది. దీంతో ఫేక్ ఔట్ లెట్ ను ప్రారంభించిన మంత్రి ఖవాజా ఆసిఫ్ నవ్వుల పాలయ్యారు. ఈ వీడియోలపై నెటిజన్లు స్పందిస్తూ.. ఇలాంటివి ప్రపంచంలో కేవలం పాకిస్థాన్ లో మాత్రమే సాధ్యమంటూ సెటైర్లు గుప్పిస్తున్నారు.

## దిగ్గజ సంస్థల చూపు తెలంగాణ వైపు

**మొదటిపేజీ తరువాయి –** పారిశ్రామికవేత్తలతో వరస సమావేశాలు నిర్వహిస్తూ తెలంగాణ రైజింగ్-2047 విజన్ డాక్యుమెంట్ లక్ష్యాల్ని వివరించారు. తెలంగాణతో కలిసి పనిచేసేందుకు పలు సంస్థల ప్రతినిధులు ఆసక్తి చూపారు. ఇజ్రాయెల్ ఇన్నోవేషన్ అథారిటీ ఛైర్మన్ అలోన్ స్టోపెల్‌తో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి భేటీ అయ్యారు. వ్యవసాయం, వాతావరణ మార్పులకు చెందిన ఇన్నోవేషన్ స్టార్టప్‌లసహకారాలపై విస్తృతంగా చర్చించారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డీప్‌టెక్ ఇన్నోవేషన్‌తో పాటు. హెల్త్‌టెక్, అగ్రి-టెక్, సైబర్‌సెక్యూరిటీ, ఏరో స్పేస్ వంటిసాంకేతిక రంగాల్లో తెలంగాణ స్టార్టప్‌లకు ఇజ్రాయెల్ మద్దతివ్వడంతో పాటుభాగస్వామ్యం పంచుకోనుంది.ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో యూఏఈ ఆర్థిక, పర్యాటక శాఖ మంత్రి అబ్దుల్లా బిన్‌తౌక్ అల్ మార్రీ భేటీ అయ్యారు. రాష్ట్రంలో చేపట్టే భారీ మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు, ముఖ్యంగా భారత్ ఫ్యూచర్ సిటీపై చర్చించారు. రాష్ట్రాన్ని 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థికవ్యవస్థగా తీర్చిదిద్దేలక్ష్యంతోరూపొందించిన తెలంగాణ రైజింగ్-2047 విజన్‌ని యూఏఈ మంత్రికి సీఎం వివరించారు. భారత్ ఫ్యూచర్ సిటీ ప్రాజెక్ట్ దేశంలోనే తొలి నెట్-జీరో గ్రీన్‌ఫీల్డ్ స్మార్ట్ సిటీగా రూపుదిద్దుకోనుందని తెలిపారు. సుమారు 30 వేలఎకరాల్లో విస్తరించే ఆ నగరంలో ఏఐ, విద్య, ఆరోగ్యం, పరిశ్రమలు, నివాస, వినోద రంగాలకు ప్రత్యేక జోన్లు ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు. భారత్ ఫ్యూచర్ సిటీలో ఇప్పటికే మారుబేని, సెమ్‌కార్ప్ వంటి అంతర్జాతీయ సంస్థలు భాగస్వాములుగా ఉన్నాయని ఇటీవలే రిలయన్స్ గ్రూప్ వంతారాతో



కొత్త జూ ఏర్పాటు కోసం అవగాహన ఒప్పందం కుదిరిందని సీఎం వెల్లడించారు. భారత్ ఫ్యూచర్ సిటీని ప్రపంచ స్థాయి నగరంగా అభివృద్ధి చేసేందుకు తెలంగాణతో కలిసి పనిచేసేందుకు తమ ప్రభుత్వం సిద్ధంగా ఉందని యూఏఈ మంత్రి అబ్దుల్లా బిన్‌తౌక్ అల్‌మార్రీ తెలిపారు. ప్రాజెక్ట్ వేగవంతమయ్యేందుకు రెండు ప్రభుత్వాల అధికారులతో సంయుక్త టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేయాలని సూచించారు.ప్రతినిధుల బృందం చర్చలు : ప్రపంచ టెక్ దిగ్గజం గూగుల్ సంస్థ వివిధ రంగాల్లో రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి పనిచేసేందుకు ముందుకొచ్చింది. వ్యవసాయం, వాతావరణ మార్పు, పట్టణ కాలుష్య సమస్యల పరిష్కారంలో రాష్ట్ర ప్రభుత్వంతో భాగస్వామ్యమవుతామంది. ట్రాఫిక్ నియంత్రణ, సైబర్ సెక్యూరిటీ, వ్యవసాయం, స్టార్టప్‌లలో భాగస్వామ్యం పంచుకునేందుకు సంసిద్ధత వ్యక్తం చేసింది. గూగుల్ ఆసియా పసిఫిక్ ఏరియా ప్రెసిడెంట్ సంజయ్ గుప్తాతో దావోస్‌లో రేవంత్‌రెడ్డి సమావేశమయ్యారు. ప్రాంతీయ ఆర్థికవృద్ధికి తెలంగాణ అమలు చేస్తున్న క్యూర్, ప్యూర్, రేర్ అభివృద్ధి నమూనాను సీఎం వివరించారు. వ్యవసాయ రంగంలో ఎరువుల అతిగా వినియోగంతో ఏర్పడుతున్న సమస్యలు, రైతులకు అవగాహన కల్పించాల్సిన అవసరంపై ఈ సమావేశంలో ప్రతినిధుల బృందం చర్చించింది. సమస్యల పరిష్కారానికి, సమస్యలు తలెత్తకుండా నివారించేందుకు ముందస్తు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ట్రాఫిక్ నియంత్రణ, సైబర్ సెక్యూరిటీ, వ్యవసాయం, స్టార్టప్‌లు మరియు వాతావరణ మార్పు అంశాల్లో తెలంగాణకు పూర్తి స్థాయిలో మద్దతు అందించేందుకు గూగుల్ సిద్ధంగా ఉందని గూగుల్ ఏపీఏసీ ప్రెసిడెంట్ సంజయ్ గుప్తా తెలిపారు.తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఒక కీలక ప్రతిపాదన చేశారు. ప్రపంచ ఆర్థిక సదస్సు ఫాలోఅప్ సదస్సును ప్రతి సంవత్సరం తెలంగాణలో నిర్వహించాలని ఆయన సూచించారు. దావోస్‌లో జరుగుతున్న సదస్సులో ఆయన ఈ అంశాన్ని ప్రస్తావించారు. ప్రతి సంవత్సరం జులైలో హైదరాబాద్ నగరంలో ఫాలోఅప్ సదస్సు నిర్వహించాలని ఆయన కోరారు. ముఖ్యమంత్రి ప్రతిపాదనకు ప్రముఖ వ్యాపారవేత్తలు, పాలసీ నిర్ణేతలు మద్దతు తెలిపారు.ఇదిలా ఉండగా, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో బ్లైజ్ కో ఫౌండర్ సీఈవో దినకర్ మునగాల సమావేశమ య్యారు. హైదరాబాద్ లో బ్లైజ్ ఆర్ అండ్ డీ సెంటర్ విస్తరణకు తెలంగాణ ప్రభుత్వంతో ఆయన ఎంవోయూ కుదుర్చుకున్నారు. దావోస్ ప్రపంచ ఆర్థిక సదస్సులో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలంగాణ లైఫ్ సైన్సెస్ పాలసీని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.

# కొత్తకొండలో దేవాదాయ శాఖపై తీవ్ర ఆరోపణలు ?

**ప్రసాదాల పేరుతో భారీ స్కాం? బినామీలకు అప్పజెప్పిన టెండర్లు నిజమేనా ?**

**ప్రభుత్వ నిబంధనలకు తూట్లా ?**

**అర్చకుల చేతిలో ప్రసాదాల టెండర్లు! ఇలా ఎక్కడైనా ఉందా ?**

**భక్తుల్లో ఆగ్రహం**



**భీమదేవరపల్లి జనవరి 21 (ప్రజా మంటలు) :** దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న కొత్తకొండ శ్రీ వీరభద్ర స్వామి బ్రహ్మోత్సవాలలో లడ్డూల తయారీ వివాదాస్పదంగా మారింది. ప్రసాదాల తయారీ, టెండర్ల నిర్వహణలో భారీ అవక తవకలు జరుగుతున్నాయంటూ భక్తులు, స్థానికులు తీవ్ర ఆరోపణలు చేస్తున్నారు.

### కొత్తకొండ బ్రహ్మోత్సవాల్లో అర్చకులకే లడ్డు టెండరా ?

దేవాదాయ శాఖలో పనిచేస్తున్న అలయ అర్చకులే ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ప్రసాదాల టెండర్లు దక్కించుకుంటున్నారని, ఆ తర్వాత వాటిని బినామీలకు అప్పగించి శాఖ ఆదాయాన్ని గండి కొడుతున్నారని భక్తులు ఆరోపిస్తున్నారు. ప్రతి ఏడాది ఇదే తంతు కొనసాగుతోందని భక్తుల ఆరోపణ, అధికారులు కూడా తెలిసి కూడా చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. టెండర్ నిబంధనలను పూర్తిగా ఉల్లంఘిస్తూ ఇష్టానుసారంగా ప్రసాదాల తయారీ జరుగుతోందని స్థానికుల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### లడ్డు తయారీలో నాణ్యత శూన్యమా ?

నాణ్యతలేని పదార్థాల వినియోగం, పాచిపోయిన పులిహోర, బూజు పట్టిన లడ్డులు సంచుల్లో నింపడం, పాత లడ్డులను మళ్లీ రీసైకిల్ చేసి భక్తులకు విక్రయం వంటి ఆరోపణలు మరింత కలకలం రేపుతున్నాయి. అంతేకాదు, అపరిశుభ్ర ప్రదేశాల్లో, మాస్కులు, గ్లౌజులు లేకుండానే ప్రసాదాల తయారీ జరుగుతోందని భక్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ పరిస్థితుల్లో భక్తుల ఆరోగ్యంతో చెలగాటం ఆడుతున్నారని మండిపడుతున్నారు.

### పలువురు ప్రముఖులకు ఇదే ప్రసాదమా ?

ఇదే ప్రసాదాన్ని వీవీఐపీలు, మంత్రులు, కేంద్ర సహాయ శాఖ మంత్రి బండి సంజయ్, దేవాదాయ శాఖ మంత్రి కొండ సురేఖ, హుస్నాబాద్ నియోజకవర్గ మంత్రి సహా పలువురు ప్రముఖులకు అందజేస్తున్నారని సమాచారం రావడంతో వ్యవహారం మరింత తీవ్రతరమైంది.

### అసలు లడ్డు తయారీలో కాంట్రాక్టర్ల పాత్ర ఉందా ?

దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారులు కాంట్రాక్టర్లకు అండగా నిలబడి సహాయ సహకారాలు అందిస్తున్నారని ఆరోపణలు గుప్పు మంటున్నాయి. తక్షణమే ఉన్నత స్థాయి విచారణ చేపట్టాలని, అవకతవకలకు బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, భక్తుల ఆరోగ్యానికి భద్రత కల్పించాలి అంటూ భక్తులు గట్టిగా డిమాండ్ చేస్తున్నారు.

### ఈ ఆరోపణలపై దేవాదాయశాఖ స్పందిస్తుందా ?

భక్తుల విశ్వాసాన్ని పణంగా పెట్టిన ఈ వ్యవహారంపై దేవాదాయ శాఖ ఎప్పుడు స్పందిస్తుంది కొత్తకొండలో జరుగుతున్న ఈ ప్రసాదాల 'అవకతవకల పర్వం' కు ఎప్పుడు తెరపడుతుంది? అన్న ప్రశ్నలు ఇప్పుడు ప్రజల్లో ప్రతిధ్వనిస్తున్నాయి.

# మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని పునరుద్ధరించాలి

**జగిత్యాల జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు తాటిపర్తి విజయలక్ష్మి దేవేందర్ రెడ్డి.**



**జగిత్యాల జనవరి 21 ( ప్రజా మంటలు) :** మహాత్మా గాంధీ జాతీయ ఉపాధిహామీ పథకాన్ని పునరుద్దరించాలని జగిత్యాల జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు తాటిపర్తి విజయలక్ష్మి దేవేందర్ రెడ్డి అన్నారు.జగిత్యాల రూరల్ మండలం చల్ గల్ గ్రామంలో ఉపాధి హామీ వర్కర్స్ తో విజయలక్ష్మి మాట్లాడుతూ గ్రామీణ ఉపాధి హామీ పథకం మహాత్మా గాంధీ పేరును తొలగిస్తూ కేంద్ర ప్రభుత్వ నిర్ణయం తీసుకోవడం సరైన నిర్ణయం కాదన్నారు. మహాత్మా గాంధీ మన దేశానికి స్వాతంత్రం తెచ్చిన గొప్ప మహనీయుడని గాంధీ పేరు లేకుండా చేయాలని కేంద్రంలోని బిజెపి పాలకులు కుట్రలు చేస్తున్నారని విజయలక్ష్మి ఆరోపించారు.ఎంతోకాలంగా దేశవ్యాప్తంగా ప్రజలకు ఎంజి ఎన్ ఆర్ ఇ జిఎ ప్రజల ఉద్యమాల ఫలితంగా రూపుదిద్దుకుంది. ప్రతి చేతికి పని, పనికి తగ్గ వేతనం అనే హామీని ఈ పథకం ద్వారా ప్రజలకు సిద్ధించిందన్నారు .గ్రామీణ భారతంలో పని కోరుకునే వారికి చట్టబద్ధమైన హక్కును కల్పించిందని ఆమె గుర్తు చేశారు. దేశవ్యాప్తంగా 100 రోజులు ఉపాధికి కూలీలకు భరోసా కల్పిస్తూ హామీ ఇచ్చిందని, వికేంద్రీకృత పాలనను బలోపేతం చేసిందన్నారు. మహిళలు, భూమిలేని నిరుపేదలను శక్తివంతం చేసిందని కొనియాడారు. ఇంతటి మహోన్నత పథకం కు జాతిపిత మహాత్మా గాంధీ పేరు పెడితే ఓర్వలేని బిజెపి ప్రభుత్వం, అయన పేరును తొలగించాలని నిర్ణయం తీసుకొని, గాంధీజీ పేరు మార్పు, విలువల పట్ల ఉన్న దీర్ఘకాల అసౌకర్యాన్ని ఆ నమ్మకాన్ని ప్రతిబింబించేలా చేస్తుంది. ప్రజాకేంద్రిత సంక్షేమ చట్టంతో జాతిపితకు ఉన్న అనుబంధాన్ని తొలగించేందుకు ప్రయత్నం చేస్తున్నారని విజయలక్ష్మి దుయ్యాబట్టారు.తదుపరి బాలికలకు, మహిళలకు ఇందిరా ప్రియదర్శని ఉడాన్ కార్యక్రమం లో భాగంగా సానిటరీ న్యాప్ కిన్ లనీ పంపిణి చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మహిళా కాంగ్రెస్ ఉపాధ్యక్షురాలు సుగుణ జున్ను కవిత మహిళలు పాల్గొన్నారు.

# మెడికవర్ హాస్పిటల్స్ లో రోబోటిక్ ఆర్థోపెడిక్ సర్జరీ సేవలు

**రోబోటిక్ యంత్రాలను ప్రారంభించిన సీపీ సజ్జనార్**

**సికింద్రాబాద్, జనవరి 21 ( ప్రజామంటలు) :** సికింద్రాబాద్ మెడికవర్ హాస్పిటల్స్ లో ఆధునిక రోబోటిక్-అసిస్టెడ్ ఆర్థోపెడిక్ సర్జరీ సిస్టమ్ ప్రారంభమైంది. ఈ సౌకర్యాన్ని బుధవారం హైదరాబాద్ సిటీ పోలీస్ కమిషనర్ వి.సి. సజ్జనార్ ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో మెడికవర్ హాస్పిటల్స్ ఇండియా చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ అనిల్ కృష్ణ, చీఫ్ రోబోటిక్ జాయింట్ రీప్లేస్మెంట్ సర్జన్ డా. ఉదయ్ కృష్ణ మైనేని, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ హరి కృష్ణ, సీనియర్ వైద్యులు, ఆసుపత్రి అధికారులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా సిటీ పోలీస్ కమిషనర్ వి.సి. సజ్జనార్ మాట్లాడుతూరోబోటిక్ టెక్నాలజీ ద్వారా వైద్య సేవల్లో ఖచ్చితత్వం పెరిగి, రోగులు వేగంగా కోలుకునే అవకాశం ఉంటుందని తెలిపారు.ఈ రోబోటిక్ సిస్టమ్ ప్రపంచవ్యాప్తంగా వినియోగంలో ఉన్న మాకో ( ఎంఏకేఓ) టెక్నాలజీ ఆధారంగా పనిచేస్తూ, హిప్, మోకాలి మార్పిడి శస్త్రచికిత్సల్లో అధిక ఖచ్చితత్వాన్ని అందిస్తుందన్నారు. శస్త్రచికిత్సకు ముందస్తు ప్రణాళికతో పాటు ప్రత్యక్ష మార్గదర్శకంతో చికిత్సలు నిర్వహించవచ్చున్నారు.డా. ఉదయ్ కృష్ణ మైనేని మాట్లాడుతూరోబోటిక్ సహకారంతో ఇంప్లాంట్ అమరిక మరింత ఖచ్చితంగా జరుగుతుందని, మినిమల్లి ఇన్వేసివ్ విధానాల వల్ల రోగులు త్వరగా కోలుకుంటారని తెలిపారు.డాక్టర్ అనిల్ కృష్ణ మాట్లాడుతూఅంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణమైన ఆధునిక వైద్య సేవలను ప్రజలకు అందించడమే మెడికవర్ లక్ష్యమని పేర్కొన్నారు.రోబోటిక్ ఆర్థోపెడిక్ సర్జరీ ప్రారంభంతో మెడికవర్ హాస్పిటల్స్ సికింద్రాబాద్లో నాణ్యమైన జాయింట్ రీప్లేస్మెంట్ చికిత్సలకు విశ్వసనీయ కేంద్రంగా మరింత బలపడనుంది అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి ఆయా



విభాగాల వైద్య నిపుణులు, సిబ్బంది పాల్గొన్నారు.

# నేరాల నియంత్రణకు,కమ్యూనిటీ భద్రతకు సీసీ కెమెరాలు దోహదం చేస్తాయి

**సీసీ కెమెరాలు ప్రారంభించిన జగిత్యాల ఎమ్మెల్యే డా సంజయ్ కుమార్**



**జగిత్యాల రూరల్ జనవరి 21 (ప్రజా మంటలు) :** రూరల్ మండలం బాలపల్లి గ్రామంలో దాతల సహకారంతో గ్రామంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను ప్రారంభించిన జగిత్యాల ఎమ్మెల్యే డా సంజయ్ కుమార్ అనంతరం దాతలను శాలువాతో సత్కరించి అభినందించిన జగిత్యాల ఎమ్మెల్యే డా సంజయ్ కుమార్ ఎమ్మెల్యే మాట్లాడుతూ నూతన సాంకేతికత ను గ్రామాల్లో ఉపయోగించి దాతల సహకారంతో 2లక్షల రూపాయల విలువగల సి సి కెమెరాలు ఏర్పాటు అభినందనీయం. సిసి కెమెరాల ఏర్పాటు తో పాటు వారు నిర్వహణ చాలా ముఖ్యం..నేరాల నియంత్రణ,గ్రామంలో కొత్త వ్యక్తుల రాకపోకలు చిత్రించి,అనుమానాస్పద వ్యక్తులను గుర్తించడానికి ఉపయోగ పడుతుంది.గ్రామంలో నూతన గ్రామపంచాయతీ,అంగన్వాడీ భవనానికి గతంలో భూమిపూజ చేయటం జరిగిందన్నారు.గ్రామ అభివృద్ధి కి నిధులు మంజూరు చేసి అభివృద్ధి కి తన వంతుగా కృషి చేస్తా అన్నారు.ప్రతి గ్రామానికి మహిళ సంఘాల బలోపేతానికి ప్రభుత్వం ఇందిరమ్మ భవనాలు మంజూరు చేయటం జరిగింది.సరైన స్థలం గుర్తించి,దాతల సహకారంతో సేకరించి నిర్మాణం చేపట్టాలని అందరికీ ఉపయోగంగా ఉంటుంది అన్నారు ఎమ్మెల్యే.ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు నక్కల రవీందర్ రెడ్డి,బాల ముకుందం,సర్పంచ్ ఉప సర్పంచ్ లు రెడ్డి రత్న,గుంటీ రవి,పోరండ్ల సర్పంచ్ ఉప సర్పంచ్ నక్క హరీష్,మల్లేశం గౌడ్,మాజీ ఉప సర్పంచ్ గంగారెడ్డి,నాయకులు పెద్దిరెడ్డి రవీందర్ రెడ్డి,కడ మహేష్, సత్యనారాయణ,కొండ శ్రీనివాస్,నారాయణ,తోట గంగరాజం,శశి కుమార్,భూమారెడ్డి,రవి,గంగాధర్,గ్రామ నాయకులు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# గాంధీలో అరుదైన సర్జరీ చేసిన వైద్యులు

**25ఏండ్ల యువతికి పునఃర్జన్మ ప్రసాదించిన గాంధీ డాక్టర్లు**

**సికింద్రాబాద్, జనవరి 21 ( ప్రజామంటలు) :** గాంధీఆస్పత్రి వైద్యులు అరుదైన ఆపరేషన్ను విజయవంతంగా నిర్వహించి ఓ మహిళ రోగికి పునర్జన్మ ప్రసాదించారు. కార్డియోథోరాసిస్ విభాగం ఆధ్వర్యంలో చేపట్టిన సర్జరీ వివరాలను ఆస్పత్రి సూపరింటెండెంట్ ప్రొ. వాణితో కలిసి సీటీసర్జరీ హెచ్ఓడీ ప్రొ. రవీంద్ర బుధవారం మీడియాకు వెల్లడించారు. వివరాలు ఇవి...ఆసిఫాబాద్కు చెందిన పల్లవి (25) పలు అనారోగ్య సమస్యలతో అక్కడి స్థానిక ఆస్పత్రిలో చేరింది.తర్వాత వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికు వెల్లగా హృద్రోగ సమస్యలు గుర్తించిన అక్కడి వైద్యులు గాంధీఆస్పత్రికి రిఫర్ చేశారు. పలు రుగ్మతలతోపాటు శ్వాస తీసుకోవడంలో తీవ్ర ఇబ్బందులు, గుండెదడతో బాధపడుతున్న పల్లవిని కార్డియోథోరాసిస్ సర్జరీ (సీటీ సర్జరీ) వైద్యులు పలురకాల వైద్యపరీక్షలు నిర్వహించారు. బార్టెల్బీల్ సిండ్రోమ్ (బీబీఎస్) బహుళ అవయవాలను ప్రభావితం చేసే జన్యుపరమైన రుగ్మత), పాలీడాక్టిలీ (పుట్టుకతోనే చేతులు, కాళ్లకు అదనపు వ్రేళ్లు ఉండడం) రెడ్కోస్డిస్ట్రోఫీ (కండరాల బలహీనత), రెటినిటోస్ పిగ్మెంటోసా (వంశపారంపర్యంగా వచ్చే కంటివ్యాధి, దృష్టిలోపం) ఊబకాయం, మేథోవైకల్యం, టైప్1 డయాబెటిస్తోపాటు హృద్రోగ రుగ్మతలతో బాధితురాలు బాధపడుతున్నట్లు గుర్తించారు. ఓస్టియంప్రైమమ్ (పుట్టుకతోవచ్చే గుండెలోపం) ఆటిజమ్ స్పెక్ట్రమ్ డిజార్డర్ (ఏఎస్డీ) కర్ణిక సెప్టంలో 14.7 మిల్లీమీటర్ల రంధ్రాన్ని నిర్ధారించారు. ఇంజెక్షన్ ప్రెక్షన్ (ఈఎఫ్) 65 పర్సంట్గా అంచనా వేశారు. సీటీ సర్జరీ హెచ్ఓడీ ప్రొ. రవీంద్ర నేతృత్వంలో పెరికార్డియంతో అనూలోప్లాస్టీ, ఓస్టియం ప్రైమస్ ఏఎస్డీ క్లోజర్తో మిట్రల్వాల్వు ఎఎంఎల్ను రిపేర్ చేసి, సంక్లిష్టమైన సర్జరీని విజయవంతంగా పూర్తి చేశారు. పలు రుగ్మతలతో బాధపడుతున్న రోగికి ఇటువంటి సర్జరీ చేయడం సవాల్తో కూడుకున్నదని గాంధీ సూపరింటెండెంట్ ప్రొ. వాణి అన్నారు. లక్షలాది రూపాయలు వ్యయం అయ్యే సర్జరీని గాంధీఆస్పత్రిలో ఉచితంగా నిర్వహిం చామన్నారు. అరుదైన సర్జరీని విజయవంతంగా నిర్వహించిన సీటీ



సర్జరీ హెచ్ఓడీ రవీంద్ర, వైద్యులు రవిశ్రీనివాస్, ప్రశాంత్, రాజ్ కుమార్, అనస్థీషియా వైద్యులు మురళీ, కిరణ్, శ్రేయ, సుచరిత, సాయిప్రసన్నలను ఆమె అభినందించారు. తనకు పునర్జన్మ ప్రసాదించిన గాంధీ వైద్యులు, సిబ్బందికి బాధితురాలు పల్లవి కృతజ్ఞతలు తెలిపారు. ఆర్ఎంఓలు శేషాద్రి, కళ్యాణ్చక్రవర్తి, నవీన్, హసిత, నర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

# రాష్ట్రస్థాయి గణతంత్ర దినోత్సవ పరేడ్కు జ్యోతి హై స్కూల్ ఐఐటీ అకాడమీ విద్యార్థులు




**జగిత్యాల జనవరి 21 (ప్రజా మంటలు) :** పట్టణంలోని జ్యోతి హైస్కూల్ ఐఐటీ అకాడమీ కి చెందిన 8 మంది స్కౌట్స్ సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్లో ప్రతి సంవత్సరం ఘనంగా నిర్వహించబడే రాష్ట్రస్థాయి గణతంత్ర దినోత్సవ వేడుకల పరేడ్కు ఎంపిక కావడం పాఠశాలకు ఎంతో గర్వకారణంగా నిలిచింది ఈ రాష్ట్రస్థాయి పరేడ్కు సంబంధించిన శిక్షణ మరియు రిహార్సల్స్ 21-01-2026 నుండి 25-01-2026 వరకు సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్లో జరుగనున్నాయి.ఈ శిక్షణ అనంతరం 26-01-2026 నాడు గణతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా రాష్ట్ర గవర్నర్ సమక్షంలో జరిగే ప్రధాన పరేడ్లో ఎంపికైన స్కౌట్స్ తమ అద్భుతమైన ప్రదర్శనను అందించనున్నారు. ఈ ప్రదర్శన ద్వారా విద్యార్థులు పాఠశాల ప్రతిష్టను రాష్ట్రస్థాయిలో మరింతగా చాటనున్నారు.ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ మరియు జిల్లా స్కౌట్స్ అండ్ గైడ్స్ కమిషనర్ బియ్యాల హరి చరణ్ రావు పరేడ్ ఎంపికైన విద్యార్థులను హృదయపూర్వకంగా అభినందించారు. అదే విధంగా నవంబర్ 22 నుంచి 29 వరకు లక్నో లో జరిగిన 19 వ జాతీయ స్థాయి జంబోరిలో 6 స్కౌట్స్ 2 గైడ్స్ పాల్గొన్నారు అని అన్నారు. భవిష్యత్తులో కూడా రాష్ట్ర, జాతీయ స్థాయి కార్యక్రమాల్లో పాల్గొని పాఠశాలకూ, సమాజానికీ గౌరవాన్ని తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమనికి సహకరించిన తల్లిదండ్రులకూ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా స్కౌట్స్ అండ్ గైడ్స్ సెక్రటరీ కొలగని మధు సుధన్, జాయింట్ సెక్రటరీ జమున జిల్లా ఆర్గనైజింగ్ కమిషనర్ వెంకటేశ్వర్లు, ట్రైనింగ్ కమిషనర్ నాగరాజు, కబ్ కమిషనర్ వినోద్ గౌడ్, ట్రెజరర్ నర్సయ్య, పాఠశాల డైరెక్టర్స్ బియ్యాల హరి చరణ్ రావు, శ్రీధర్ రావు, మౌనిక రావు, అజిత , ఉపాధ్యాయ బృందం విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# అన్ని వర్గాల సంక్షేమంతో పాటుగా శుద్ధ నీటి వ్యవస్థల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉంది

**రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు**






**ధర్మపురి జనవరి 21 (ప్రజా మంటలు) :** జగిత్యాల జిల్లాలోని ధర్మపురిలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, అడ్లూరి లక్ష్మణ్ కుమార్ లతో కలిసి పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు.తెలంగాణ రాష్ట్రంలో విద్య, వైద్యం, అన్ని వర్గాల సంక్షేమంతో పాటు శుద్ధ త్రాగునీటి వ్యవస్థల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు అన్నారు.ఈ సందర్భంగా ఇంటిగ్రేటెడ్ మోడల్ పాఠశాల భవన నిర్మాణానికి రూ.200 కోట్లు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల భవనానికి రూ.10 కోట్లు, ఎన్టీపీ శుద్ధ త్రాగునీటి ప్లాంట్కు రూ.24.5 కోట్లు, ఎస్సీ బాలుర వసతిగృహానికి రూ.2 కోట్లు కేటాయించినట్లు ప్రకటించారు. పేద, వెనుకబడిన వర్గాల పిల్లలకు నాణ్యమైన విద్య, వసతి, మౌలిక సదుపాయాలు అందించడమే లక్ష్యమని ఉప ముఖ్యమంత్రి పేర్కొన్నారు.మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ వ్యవసాయం రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక అని, రైతుల సంక్షేమానికి ప్రభుత్వం సమగ్ర చర్యలు తీసుకుంటోందన్నారు. మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ వెనుకబడిన వర్గాల విద్యార్థులకు వసతి, భద్రత, పఠన వాతావరణం కల్పించడమే ప్రభుత్వ ధ్యేయమని స్పష్టం చేశారు. ఈ అభివృద్ధి పనులతో జగిత్యాల జిల్లా సమగ్ర అభివృద్ధి పథంలో ముందుకు సాగుతుందని నేతలు తెలిపారు.

# వాహనదారులు సీట్ బెల్ట్, హెల్మెట్ ధరించాలని పోలీసుల అవగాహన ర్యాలీ

**సిరిసిల్ల వేణుగోపాల్**





**జగిత్యాల జనవరి 21 (ప్రజా మంటలు) :** పట్టణంలో అరేవ్ అలైవ్ కార్యక్రమంలో భాగంగా బుధవారం చైతన్య పాఠశాల విద్యార్థులచే పట్టణ పోలీసులు నిర్వహించారు..ఈ కార్యక్రమంలో విద్యార్థుల చేత ట్రాఫిక్ అవగాహన గురించి వాహన దారులకు తెలియజేశారు..ఈ సందర్భంగా హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించిన వారిని అభినందించి గులాబీ పుష్పాలను అందజేసి అలాగే ధరించని వారికి హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించాలి అని తెలియజేస్తూ గులాబీ పుష్పాలను అందజేశారు.ఈ సందర్భంగా పట్టణ ఎస్సై సుప్రియ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు సీట్ బెల్ట్, హెల్మెట్ ధరించాలని అన్నారు.. విద్యార్థుల చేత ఈ కార్యక్రమం నిర్వహించడం వలన వారికి ట్రాఫిక్ రూల్స్ పై అవగాహన కలుగుతుందని అన్నారు. విద్యార్థులు వారి తల్లిదండ్రులకు కూడా వాహనం నడుపుతున్నప్పుడు హెల్మెట్ ధరింపమని గుర్తుచేయాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ పోలీస్ సిబ్బంది స్కూల్ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# శ్రీ భక్త మార్కండేయ జయంతి వేడుకలు

**పాల్గొన్న బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డా"బోగ శ్రావణి**



**గొల్లపల్లి జనవరి 21 ప్రజా మంటలు :** బుగ్గారం మండలం కేంద్రంలో శ్రీ భక్త మార్కండేయ దేవాలయంలో స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించిన బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు డా"బోగ శ్రావణి ఈ కార్యక్రమంలో బుగ్గారం బిజెపి మండల అధ్యక్షులు శ్రీధర్, రాష్ట్ర పద్మశాలి మహిళా ఉపాధ్యక్షురాలు సింగం పద్మ, పద్మశాలి సంఘం మండల అధ్యక్షులు బండారి మహేష్, ఆలయ కమిటీ అధ్యక్షులు బుధారపు పరమేశ్వర్, జగిత్యాల పట్టణ పద్మశాలి సంఘం ఉపాధ్యక్షులు భోగరాజు కుమార్, జగిత్యాల పట్టణ కోశాధికారి కొక్కుల ప్రభాకర్, ఉపాధ్యక్షులు బంక రాజ్ కుమార్,జక్కుల సుధాకర్, చెట్పెల్లి రాజనర్సు, ప్రధాన కార్యదర్శి మామిడాల శ్రీనివాస్, విజయ్, మల్లేశం, బాలరాజు,మండల పద్మశాలి కుల బాంధవులు మహిళలు యువకులు పాల్గొన్నారు.

# ఘనంగా శ్రీ భక్త మార్కండేయ జయంతి వేడుకలు



**గొల్లపల్లి జనవరి 21 ప్రజా మంటలు :** గొల్లపల్లి మండల కేంద్రంలో మండలంలో భక్త మార్కండేయ స్వామి జయంతి వేడుకలను పద్మశాలి సేవా సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహిం చారు ఈ సందర్భంగా పద్మశాలి సేవా సంఘం అధ్యక్షులు అంకం భూమయ్య,మాట్లాడుతూ బ్రహ్మ తన నుదుటిన 16 సంవత్సరాల ఆయుష్షు ఇచ్చినప్పటికి తను శివారాధన, భక్తి శ్రద్ధలతో నియమ నిష్ఠలతో గురువుల పట్ల వినయ విధేయలతో యమధర్మరాజుని ఎదురించి చిరంజీవిగా నిలిచాడు. మార్కండేయ పురాణం రాసి నేడు మానవజాతికి ఆదర్శ ప్రాయుడయ్యాడని కొనియాడారు. నేడు మార్కండేయ పద్మశాలి నేతన్నల కుల దైవంగా పూజలందుకుంటున్నాడని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి సేవా సంఘం అధ్యక్షులు అంకం భూమయ్య ఉపాధ్యక్షులు గాజంగి హనుమాన్లు, ప్రధాన కార్యదర్శి చౌటుపల్లి తిరుపతి, సహాయ కార్యదర్శి చౌటుపల్లి రఘునందన్, కోశాధికారి అంకం లక్ష్మీనారాయణ, మాజీ అధ్యక్షులు కార్యదర్శి తిరుపతి లక్ష్మణ్, లింబాద్రి,సుదర్శన్ , శంకరయ్య,సమ్మయ్య, సత్యనారాయణ, సంజీవ్,అంజయ్య, జనార్ధన్, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# రైతు రక్షణ సమితి క్యాలెండర్ ఆవిష్కరణ

**అభినందించిన అడిషనల్ కలెక్టర్ రవికుమార్**



**ఎల్కతుర్తి జనవరి 21 ప్రజా మంటలు :** రైతుల సమస్యల పరిష్కారానికి విశేషంగా కృషి చేస్తున్న ఎల్కతుర్తి మండలం సూరారం గ్రామానికి చెందిన తెలంగాణ రైతు రక్షణ సమితి జిల్లా అధ్యక్షుడు హింగే భాస్కర్ తెలంగాణ రైతు రక్షణ సమితినీ హనుమకొండ జిల్లా అడిషనల్ కలెక్టర్ ఎన్ .రవికుమార్ అభినందించారు. బుధవారం రైతు రక్షణ సమితి నాయకులతో కలిసి ఆయన తమ ఆఫీసులో రైతు రక్షణ సమితి ఆధ్వర్యంలో రూపొందించిన -2026 క్యాలెండర్ ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతు రక్షణ సమితి హనుమకొండ ఉమ్మడి కరీంనగర్ జిల్లాల అధ్యక్షుడు భాస్కర్ హింగే, హనుమకొండ జిల్లా ఉపాధ్యక్షుడు హింగే రవీందర్, జిల్లా సహాయ కార్యదర్శి అంబీరు శ్రీనివాస్, ఎల్కతుర్తి మండల ప్రధాన కార్యదర్శి కె మాధవరావు, పరకాల అధ్యక్షుడు మధుకర్, పాల్గొన్నారు.

# శ్రీ భక్త మార్కండేయ జయంతి సందర్భంగా ఆలయంలో పూజలు చేసిన డాక్టర్ భోగ శ్రావణి ప్రవీణ్



**బుగ్గారం జనవరి 21 (ప్రజా మంటలు) :** శ్రీ భక్త మార్కండేయ జయంతి సందర్భంగా బుగ్గారం మండలంలోని శ్రీ భక్త మార్కండేయ దేవాలయంలో స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించిన బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు డా బోగ శ్రావణి ఈ కార్యక్రమంలో బుగ్గారం బిజెపి మండల అధ్యక్షులు శ్రీధర్, రాష్ట్ర పద్మశాలి మహిళా ఉపాధ్యక్షురాలు సింగం పద్మ, పద్మశాలి సంఘం మండల అధ్యక్షులు బండారి మహేష్, ఆలయ కమిటీ అధ్యక్షులు బుధారపు పరమేశ్వర్, జగిత్యాల పట్టణ పద్మశాలి సంఘం ఉపాధ్యక్షులు భోగరాజు కుమార్, జగిత్యాల పట్టణ కోశాధికారి కొక్కుల ప్రభాకర్, ఉపాధ్యక్షులు బంక రాజ్ కుమార్,జక్కుల రాజనర్సు, ప్రధాన కార్యదర్శి మామిడాల శ్రీనివాస్, విజయ్, మల్లేశం మరియు మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# ట్రాఫిక్ చలాన్లు చెల్లించాలంటూ మీకు లింక్స్ వస్తున్నాయా..

**క్లిక్ చేశారో ఖాతా ఖాళీ!**

**నకిలీ వాట్సాప్ లింక్‌పై క్లిక్ చేయమంటూ మేసేజ్‌లు పంపిస్తున్న కేటుగాళ్లు**

**అమాయకపు ప్రజలే లక్ష్యంగా కొత్త తరహాలో దోపిడీలు**

**వాహనదారుల బ్యాంకు అకౌంట్స్ లూటూ చేస్తున్న సైబర్ నేరస్థులు**



ఎంతో మంది అమాయకపు ప్రజలే లక్ష్యంగా సైబర్ కేటుగాళ్లు రోజుకో ఓ కొత్త తరహా దోపిడీకి పాల్పడుతున్నారు. అయితే ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించి వాహనాలు నడుపుతూ కెమెరాలకు చిక్కుతున్నవారికి వెంటనే జరిమానా చెల్లించాలంటూ కొన్ని రోజులుగా సైబర్ మోసగాళ్లు వాట్సప్ నంబర్లకు నకిలీ ట్రాఫిక్ ఈ-చలానాల లింక్‌లను పంపి దోపిడీలు చేస్తున్నారు. అలాగే ఆన్‌లైన్‌లో చెల్లింపులు జరపోచ్చంటూ సూచనలిస్తూ వాహనదారుల బ్యాంకు అకౌంట్స్ లూటీ చేస్తున్నారు. ఇటీవల ఖైరతాబాద్ డీసీపీ శిల్పవల్లి ఫోన్‌కు ఇలానే లింకులనే సెండ్ చేశారు. దీంతో ఆర్టీఏ, ట్రాఫిక్ పోలీసు విభాగాల పేర్లతో సైబర్ నేరస్థులు పంపే లింకులను క్లిక్ చేయకూడదని వీసీ సజ్జనార్ మంగళవారం తెలిపారు. ఇటీవల ఓ దోపిడీలో అచ్చంగా ఆ వెబ్‌సైట్ కూడిన పోలీస్ అధికారిక పోర్టల్‌లాగే ఉండటంతో ట్రాఫిక్ ఫైన్ రూ.500 చెల్లించేందుకు ఓ వ్యక్తి ప్రయత్నించాడు. ఆ తర్వాత కొద్దిసేపటికే సైబర్ మోసగాళ్లు అనధికార అంతర్జాతీయ లావాదేవీల ద్వారా అతడి క్రెడిట్ కార్డు నుంచి దాదాపు రూ.6 లక్షలు దోచేశారు. ఈ మేరకు ఇలాంటి నకిలీ ఈ చలాన్ ఎస్ఎంఎస్‌ల పట్ల అప్రమత్తంగా ఉండాలని సజ్జనార్ సూచించారు. ఎస్ఎంఎస్ ద్వారా వచ్చే లింక్‌ల ద్వారా ఎప్పుడూ జరిమానాను చెల్లించకూడదని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఒక వేళ చలానా కట్టాలనుకుంటే ఎల్లప్పుడూ అధికారిక వెబ్‌సైట్‌ని లేదా రాష్ట్ర ట్రాఫిక్ పోలీసు వెబ్‌సైట్‌ను నేరుగా సందర్శించాలని సూచించారు. ఈ నేపథ్యంలో సైబర్ మోసాలకు పాలైతే తక్షణమే 1930 కాల్ చేసి ఫిర్యాదు చేయాలని సజ్జనార్ సూచించారు. మొదట ట్రాఫిక్ నిబంధనలు పాటించలేదంటూ మీ నంబర్లకు సందేశాలు పంపుతారు. ఆ లింక్‌ను క్లిక్ చేసి చలానా వివరాలు తెలుసుకోవచ్చు అని సూచిస్తారు. అది నిజమని భావించి లింక్ పై చేయగానే వాహన, చలానా, డ్రైవింగ్ లైసెన్స్‌ల నంబర్లలో ఏదో ఒకటి నమోద చేయమంటారు. అనంతరం నగదు చెల్లించేందుకు ఏ పద్ధతి ఉపయోగిస్తున్నారని అడుగుతారు. క్రెడిట్, యూపీఐ, డెబిట్ కార్డుల ద్వారా చలానా చెల్లించేందుకు సుముఖత అడుగుతారు. దాని ద్వారా వాహన దారుల నమోదు చేసే యూపీఐ, క్రెడిట్, డెబిట్ కార్డుల వివరాలు, పిన్ నంబర్లను తెలుసుకుంటారు. అదే బ్యాంకు అకౌంట్‌ను ఉపయోగించి ఆన్‌లైన్‌లో విలువైన వస్తువులు కొనుగోలు చేస్తారు. ఆ ఖాతాలోని ఉన్న డబ్బంతా దోచేస్తారు. ఈ తరహా మోసాలకు గురవకుండా ఉండాలంటే ఎలాంటి అనుమానాస్పద లింకులను క్లిక్ చేయవద్దని సీపీ సజ్జనార్ సూచించారు. ప్రభుత్వ వెబ్‌సైట్లు పూర్తవుతాయని గుర్తుంచుకోవాలన్నారు. ట్రాఫిక్ జరిమానా వివరాలు తెలుసుకునేందుకు అధికారిక వెబ్‌సైట్‌లో పరిశీలించాలని కోరారు.

**ఎలా మోసపోతున్నారంటే ? :**

ఆర్‌టీఓ ట్రాఫిక్ చలాన్.ఏపికే2 పేరిట నకిలీ ఫైళ్లను వాట్సాప్ ద్వారా పంపిస్తూ, పౌరులను మోసం చేయాలని సైబర్ నేరగాళ్లు ప్రయత్నిస్తున్నారు.

ఈ ఫైల్ ఇన్‌స్టాల్ చేస్తే మీ ఫోన్ పూర్తిగా నేరగాళ్ల నియంత్రణలోకి వెళ్లిపోతుంది. బ్యాంక్, ఎస్ఎంఎస్ కార్డు సమాచారం ప్రమాదంలో పడుతుంది. ఇలా ఫిర్యాదు చేయండి :అనధికార ఏపీకే లింక్‌లను ఎప్పటికీ డౌన్‌లోడ్ చెయ్యవద్దు. అన్ని కార్డు లావాదేవీలకు ఓటీపీ తప్పనిసరిగా ఉపయోగించండి. అనుమానాస్పద లింక్‌లు, యాప్‌లు ఉంటే వెంటనే ఫిర్యాదు చేయండి.

**ఇలా చేయకండి :**

వాట్సప్ ద్వారా వచ్చిన అనుమానాస్పద ఫైళ్లను ఓపెన్ చేయవద్దు.

అనుమానాస్పద యాప్‌లు ఇన్‌స్టాల్ చేయవద్దు.


నకిలీ ట్రాఫిక్ చలాన్ లింక్స్ నమ్మకండి.

# సమ్మక్క, సారలమ్మ జాతర సొంత వాహనాల వారికి అనువైన మార్గాలు ఇవే

**ఈనెల 28 నుంచి 31 వరకు జరగనున్న మేడారం జాతర**

**ఉభయ జిల్లాల నుంచి లక్షలాది మంది ప్రయాణికులు రాకపోకలు**

**ప్రమాద రహిత ప్రయాణాల కోసం అవగాహన కార్యక్రమాలు**






ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారంలో సమ్మక్క, సారలమ్మ జాతర ఈనెల 28 నుంచి 31 వరకు జరగనుంది. ఖమ్మం, ఇల్లెందు, కొత్తగూడెం, పాల్వంచ, మణుగూరు, భద్రాచలం, బూర్గంపాడు, సారపాక, సింగరేణి కార్మిక ప్రాంతాల నుంచి ఎక్కువ మంది జాతరకు హాజరవుతారు. ఉభయ జిల్లాల నుంచి లక్షలాది మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తారు. వన దేవతల క్షేత్రానికి వెళ్లే రోడ్లను మెరుగుపరిచేందుకు ఆర్అండ్‌బీ అధికారులు ఉపక్రమించారు. గుంతలమయంగా మారిన రహదారులకు మరమ్మతులు చేపడుతున్నారు. ఖమ్మం జిల్లా వారి కోసం : ఖమ్మం జిల్లా వాసులకు మేడారం చేరుకునేందుకు రెండు మార్గాలు ఉన్నాయి. అందులో ఒకటి, ఖమ్మం- మహబూబాబాద్-నర్సంపేట-పస్రా మీదుగా సుమారు 200-250కి.మీ. ప్రయాణించి మేడారం చేరుకోవచ్చు. ఈ మార్గం గుండా రోడ్లు విశాలంగా ఉన్నాయి. ముఖ్యంగా ఆర్టీసీ బస్సుల ద్వారా మేడారం వెళ్లేవారు ఈ మార్గాన్ని ఎంచుకోవటం ఉత్తమం. అలాగే ఖమ్మం, వైరా నియోజకవర్గాల ప్రజలు ఇల్లెందు-గుండాల-కన్నాయిగూడెం-పస్రా మీదుగా సుమారు 180-200కి.మీ. ప్రయాణంతో మేడారం చేరుకోవచ్చు. ఇది అత్యంత దగ్గరే అయినా అటవీమార్గం కావడంతో ప్రయాణ వసతులు తక్కువగా ఉంటాయి. సత్తుపల్లి నియోజకవర్గ ప్రజలు కొత్తగూడెం మీదుగా, మధిర నియోజకవర్గం వాసులు ఖమ్మం మీదుగా ఇల్లెందు చేరుకుని ఇదే మార్గంలో మేడారం వెళ్లొచ్చు.

ద్విచక్రవాహనాలు, కార్లలో ప్రయాణించేవారికి ఈ మార్గం అనువైనది. ఆర్టీసీ ప్రయాణికులకు తగినన్ని సర్వీసులు అందుబాటులో ఉండకపోవచ్చు.

**భద్రాద్రి జిల్లా వాసులకు దారి : -**

కొత్తగూడెం పరిసర ప్రాంతాలకు చెందినవారు అనిశెట్టిపల్లి-ఆళ్లపల్లి-గుండాల-పస్రా మీదుగా మేడారం వెళ్లేందుకు ప్రత్యామ్నాయ మార్గం ఉంది. ఈ రహదారి గుండా ఆర్టీసీ బస్సులు నడవవు. ప్రైవేటు వాహనదారులు వెళ్లవచ్చు. మణుగూరు పరిసర ప్రాంతాల వారికి ఏటూరునాగారం-తాడ్వాయి మార్గం అత్యంత దగ్గరగా ఉంటుంది. ఇదికాకుండా ఏడూళ్లబయ్యారం, కరకగూడెం మీదుగా ప్రత్యామ్నాయ మార్గం ఉన్నా, ఇరుకు రోడ్ల కారణంగా ప్రైవేటు, ద్విచక్రవాహనదారులు ఎక్కువగా వెళ్తుంటారు. అశ్వారావుపేట నియోజకవర్గం ప్రజలు మేడారం చేరుకునేందుకు కుక్కునూరు- భద్రాచలం- మంగపేట- ఏటూరునాగారం - తాడ్వాయి మీదుగా ప్రయానించవచ్చు. ఈ మార్గంలో ఆర్టీసీ బస్సులు కూడా అందుబాటులో ఉంటాయి. ప్రత్యామ్నాయ మార్గమైన అశ్వారావుపేట- దమ్మపేట-వ ములకలపల్లి- పాల్వంచ- భద్రాచలం మీదుగా బస్సులు తక్కువగా నడుస్తాయి. పైగా దూరం ఎక్కువగా ఉంటుంది. కొత్తగూడెం, భద్రాచలం నియోజకవర్గాల ప్రజలు మణుగూరు- మంగపేట- ఏటూరునాగారం-తాడ్వాయి మీదుగా 130-150కి.మీ. ప్రయాణించి మేడారం చేరుకోవచ్చు. జాతర సమయంలో కొత్తగూడెం, భద్రాచలం డిపోల నుంచి మేడారానికి ప్రత్యేక బస్సులు నడుపుతారు. పాల్వంచ, మణుగూరు వంటి ప్రధాన కేంద్రాల నుంచి బస్సులు అందుబాటులో ఉంటాయి. ఇల్లెందు నియోజకవర్గ ప్రజలకు గుండాల-కన్నాయిగూడెం-పస్రా మీదుగా మేడారం 120-130కి.మీ. దూరం వస్తుంది.

**బూర్గంపాడు- ఏటూరునాగారం మధ్యలో కొనసాగుతున్న రోడ్డు మరమ్మతులు**

ఈ నెల 25 నుంచి 31 వరకు వరంగల్ 1,905, కరీంనగర్ 700, ఆదిలాబాద్ 369, హైదరాబాద్ 281, ఖమ్మం రీజియన్ నుంచి 240 బస్సులు నడపనున్నారు. ప్రయాణికుల డిమాండ్‌కు అనుగుణంగా ఈ సంఖ్యలో మార్పులు చేర్పులు ఉంటాయని ఉన్నతాధికారి ఒకరు తెలిపారు. ఇక భక్తులు కూడా బస్సులు గురించి ఇబ్బందులు పడకుండా ప్రయాణించవచ్చు. ప్రమాదాలు జరగకుండా : మేడారంలో సమ్మక్క, సారలమ్మ జాతరకు భక్తులంతా కుటుంబ సమేతంగా ప్రయాణిస్తుంటారు. ఈ సమయంలో సొంత వాహనాలపై వెళ్లే వారు తగిన జాగ్రత్తలు వహించాలి. అతి వేగంగా బండి నడపం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో మేడారం జాతరకు వచ్చే లక్షల మంది భక్తుల భద్రతే లక్ష్యంగా రహదారి ప్రమాదాల నివారణకు అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆర్టీసీ అధికారుల్ని ఆదేశించారు. అలాగే జాతర మార్గాల్లో హోర్డింగ్‌లను ఏర్పాటు చేయడంతోపాటు బస్‌స్టేషన్లు, ఆర్టీసీ బస్సుల్లో టీవీల ద్వారా రోడ్డు నిబంధనలపై ప్రచారం చేయాలన్నారు.



# బ్యాంక్ అద్దె ఖాతాల నేరాలు - అత్యాశకు పోయి జైలుకు

**విజయవాడలో వెలుగుచూస్తున్న మ్యూల్ ఖాతాలు**

**ప్రలోభాలకు లొంగి అద్దె ఖాతాల నేరాల్లో చిక్కుకుంటున్న అమాయకులు**

**విజయవాడ నుంచ్ ఫిలిప్పీన్స్ వరకు విస్తరించిన వైనం**



కళ్లముందు నిత్యం ఎన్నో మోసాలు, డిజిటల్ అరెస్టులు, వందల సంఖ్యలో సైబర్ నేరాల గురించిన వార్తలను ప్రతిరోజు చూస్తూనే ఉన్నాం. సైబర్ నేరస్థుల వలలో పడి కోట్లు పోగొట్టుకున్న అయాయకపు ప్రజలు ఎందరో ఉన్నారు. అప్రమత్తతపై ఎప్పటికప్పుడు అధికారులు హెచ్చరిస్తున్నా సరే తగిన సూచనలను ఇస్తున్నా, అత్యాశతో బాధితులు ఈ నేర ఉచ్చులో పడుతున్నారు. ఇలాంటి ఘటనే విజయవాడలో చోటు చేసుకుంది. విజయవాడలో ఇల్లు కట్టి అప్పులపాలైన శ్రీకాంత్‌ను ఆర్థికంగా ఆదుకుంటానని సూర్య నమ్మబలికాడు. తన వెంట ఉండి సాయం చేస్తే డబ్బుకు లోటు ఉండదని ఆశపెట్టాడు. ప్రలోభాలకు లొంగి అద్దె ఖాతాల నేరాల్లో చివరకు పాలుపంచుకుని కటకటాలపాలయ్యాడు. ఈ మ్యూల్ అకౌంట్స్ కేసు విజయవాడ నుంచ్ ఫిలిప్పీన్స్ వరకు విస్తరించింది. ఈ కేసులో మరిన్ని కోణాలు వెలుగుచూస్తున్నాయి. ప్రధాన నిందితుడు సూర్య (ఏ1)కు క్లాస్‌మేట్ అయిన నరసింహారావుకు శ్రీకాంత్ అన్న అవుతాడు. వీరు ఓసారి కూర్చొని మాట్లాడుకుంటుండగా తాను ఇటీవల ఇల్లు నిర్మించడంతో రూ. 5 లక్షల మేర అప్పులు అయ్యాయని సూర్యకు చెప్పాడు. కమీషన్‌కు ఆశపడి: అందుకు తనతో ఉంటే రూ. 5 లక్షలు ఇస్తానని సూర్య నమ్మించాడు. నీ పేరుతో ఒక కారు కొని ఇస్తానని శ్రీకాంత్‌కు చెప్పడంతో సరేనని అంగీకరించాడు. రూ. 1.20 లక్షలు వెచ్చించి సెకెండ్ హ్యాండ్ కారు కొని శ్రీకాంత్ పేరున రిజిస్ట్రేషన్ చేయించాడు. ఈ వాహనాన్ని ఉపయోగించి నిందితుడు పలు ప్రాంతాలు తిరుగుతూ బ్యాంకు ఖాతాలు తెరిపించే వ్యవహారాలను పర్యవేక్షించాడు. తన పెదనాన్న, అతని కుమారుడి హత్య కేసులో ఏ10 అరెస్టు అయి రిమాండ్‌లో ఉండి ఏడాదిన్నర క్రితం జైలు నుంచి బయటకు వచ్చాడు. అయితే ఆ తర్వాత కూడా సూర్య ముఠాతో తిరిగాడని తేలింది. కానీ ఆశించిన మేర కమీషన్ రావడం లేదని బయటకు వచ్చాడు. డిగ్రీ పూర్తయిన తర్వాత సూర్య విజయవాడలో ఏవియేషన్ కోర్సును చేశాడు. ఈ కేసులో నిందితులైన పార్వతి, ఫిలిప్పీన్స్‌లో ఉండి ఖాతాలను పర్యవేక్షిస్తున్న స్రవంతి పరిచయమయ్యారు. ఈ కోర్సు అయిన తర్వాత స్రవంతి హైదరాబాద్‌లోని ఓ ఏవియేషన్ సంస్థలో ఉద్యోగంలో చేరింది. అక్కడే పరిచయమైన ఫిలిప్పీన్స్‌కు చెందిన వ్యక్తిని ప్రేమించి పెళ్లి చేసుకుని ఆ దేశానికి వెళ్లి స్థిరపడింది. అయితే అద్దె ఖాతాలను సేకరించి వాటి ద్వారా కమీషన్ పొందవచ్చని ముగ్గురు కూడబలుక్కున్నారు. సేకరించిన కరెంటు ఖాతాలను సూర్య, పార్వతిలు ఫిలిప్పీన్స్‌లో ఉన్న స్రవంతికి పంపించేవారు. ఈ వివరాలన్నీ స్రవంతి వాటిని బెట్టింగ్, డిజిటల్ అరెస్టు మోసాల లావాదేవీల కోసం అందించేది. సేకరించిన ఖాతాల తాలూకా రిజిస్టర్డ్ మొబైల్ నెంబర్ల సిమ్‌లు కూడా తీసుకునేవారు. ఆ సిమ్‌ల కోసం ఎనిమిది ఫోన్లను ఉపయోగించేవారు. ఆ ఖాతాలకు సంబంధించి జరిగిన లావాదేవీల్లో ఆ సిమ్‌లకు వచ్చే ఓటీపీలను వినియోగించేవారు. ఈ ఓటీపీల వివరాలను నాలుగు టెలిగ్రామ్ గ్రూప్‌ల్లో సూర్య ముఠా పోస్టు చేసేది. వీటిని అవతలి వ్యక్తులు తీసుకుని లావాదేవీలు నిర్వహించేవారని తేలింది.

**తీసుకోవాల్సిన జాగ్రత్తలు**

తెలిసిన వ్యక్తులు లేదా తెలియని వ్యక్తులు ఎవరైనా సరే వారి అవసరాల కోసం బ్యాంకు ఖాతాలను ఇవ్వకూడదు. సంబంధం లేకపోయినా మన ఖాతాల్లో ఆకస్మికంగా డబ్బు జమవ్వడం, వెంటనే విత్‌డ్రా అవ్వడం వంటివి జరిగితే వెంటనే సంబంధిత బ్యాంకును సంప్రదించాలి. యూజర్ఐడీ, పాస్‌వర్డ్‌లు మార్చాలి. మరింత సందేహముంటే పోలీసులను సంప్రదించాలి. మన పేరుతో ఎన్ని ఖాతాలున్నాయో బ్యాంకుల్లో తెలుసుకోవచ్చు. మొబైల్ నంబర్, పాన్, ఓటర్ఐడీ, ఆధార్ వంటి తదితర గుర్తింపు పత్రాలతో బ్యాంకును సంప్రదిస్తే తనిఖీ చేసి ఖాతాల వివరాలను వెల్లడిస్తారు. కనీసం 6 నెలలకోసారి క్రెడిట్ బ్యూరోల దగ్గర నుంచి క్రెడిట్ నివేదికను తీసుకోవడమూ మంచిది. సంచార్ సాథీ పోర్టల్‌లోనికి వెళ్లి మీ పేరుతో ఎన్ని మొబైల్ నంబర్లు ఉన్నాయో చూసుకోండి. మీకు సంబంధం లేనివి ఉంటే వెంటనే ఫిర్యాదు చేయండి. ఇటీవలి కాలంలో యువతని ఉద్యోగాల పేరుతో సంప్రదిస్తున్నారు. ఆన్‌లైన్‌లో వచ్చే ఉద్యోగ ప్రకటనలను నమ్మొద్దు.

# మండల ఉపసర్పంచుల ఫోరం అధ్యక్షుడిగా శనిగరపు సందీప్ ను ఏకగ్రీవంగా ఎన్నిక





**ఎల్కతుర్తి జనవరి 21 ప్రజా మంటలు :** హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండల కేంద్రంలోని బుధవారం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఎలిగేటి ఇంద్రసేనారెడ్డి అధ్యక్షతన మరియు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సుకినే సంతాజి, సర్పంచుల ఫోరం అధ్యక్షుడు పుల్లూరి శ్రీధర్ రావు ఆధ్వర్యంలో ఉపసర్పంచ్ ల ఫోరం కమిటీని ఎల్కతుర్తి మండలంలో ఉన్న 11 గ్రామాల ఉప సర్పంచులు అందరు కలిసి ఏకగ్రీవంగా దండేపల్లి గ్రామానికి చెందిన శనిగరపు సందీప్ ను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. ఉపాధ్యక్షుడు గోపాల్పూర్ గ్రామ ఉప సర్పంచ్ మారుపాక సందీప్, గౌరవ అధ్యక్షులుగా బావుపేట్ గ్రామానికి చెందిన మేకల బాబును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారని పత్రికా ప్రకటన ద్వారా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో 11 గ్రామాల ఉప సర్పంచులు కలిసి ఎన్నుకోవడం జరిగిందని తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఉప సర్పంచుల ఫోరం అధ్యక్షుడిగా ఎన్నుకున్నందుకు ప్రత్యేక కృతజ్ఞతలు ధన్యవాదాలు తెలియజేశారు. మన కృషి కోసం అహర్నిశలు కృషిచేసి ఇది ఒకటి మన అభివృద్ధికి పాటు పాటుపడతానని తెలియజేశారు. నా ఎన్నికకు సహాయ సహకారాలు అందించిన ప్రతి ఒక్కరికి పేరుపేరునా కృతజ్ఞతలు ధన్యవాదాలు తెలియజేశారు.

# కన్నుల పండువగా మార్కండేయ జయంతి వేడుకలు



**గొల్లపల్లి జనవరి 21 ప్రజా మంటలు** : పెగడపల్లి మండలం లోని బతికేపల్లి గ్రామంలో శ్రీ భక్త మార్కండేయ జయంతి వేడుకలు పద్మశాలి సేవా సంఘం ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా నిర్వహించారు. మార్కండేయ జయంతి పురస్కరించుకుని ఆలయ అర్చకులు నాగరాజు మధుసూదన చార్య,మహేంద్ర చార్య,మధుకర్ చార్య లు ఉదయాన్నే స్వామి వారికి అభిషేకం నిర్వహించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మహిళలు మంగళ హారతులతో రాగా మగ్గం మీద వస్త్రాన్ని నేస్తూ స్వామి వారి శోభా యాత్ర గ్రామ పుర వీధుల గుండా కన్నుల పండుగగా నిర్వహించారు. ఇట్టి వేడుకల్లో కేశవపట్నం మండలం నుండి వచ్చిన డప్పు కళాకారుల బృందం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ వేడుకల్లో గ్రామ సర్పంచ్ ముంజ మహేశ్వరి మధుకర్,మండల పద్మశాలి సంఘం అధ్యక్షుడు గాజుల గంగ మల్లేశం,కార్యవర్గ సభ్యులు అందే వెంకటేశం, గాలిపెల్లి సత్తయ్య,గ్రామ పద్మశాలి సేవా సంఘం అధ్యక్షుడు ఎలగొండ వెంకట రమణ,కార్యవర్గ సభ్యులు తుమ్మ సత్తన్న,నల్ల మహేష్,కోమాకుల రమేష్,కుల పెద్దలు,మహిళలు పాల్గొన్నారు.

# డిప్యూటీ సీఎం ను కలిసిన బీసీ నేతలు



**ధర్మపురి జనవరి 21 ( ప్రజా మంటలు)** : పలు అభివృద్ధి కార్యక్రమాల శంకుస్థాపన కు ధర్మపురి కి విచ్చేసిన తెలంగాణ రాష్ట్ర ఉపముఖ్యమంత్రి బట్టి విక్రమార్క ని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముసిపట్ల లక్ష్మీనారాయణ కలసి బీసీ రిజర్వేషన్ల పెంపు కోసం వినతి పత్రం అందించారు. తెలంగాణ రాష్ట్రంలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించిన తర్వాతనే మునిసిపల్ ఎన్నికలకు వెళ్లాలని , బీసీలకు ఇస్తున్న హామీలు కూడా చట్టబద్ధలతో కల్పించాలి. తెలంగాణ రాష్ట్రంలో రాబోయే మున్సిపల్ ఎన్నికలకు రిజర్వేషన్లు కల్పించాలి రిజర్వేషన్లు కల్పించిన తర్వాతనే ఎన్నికలకు వెళ్లాలని , హైకోర్టులో బిసి రిజర్వేషన్ కేసు నడుస్తున్న నేపథ్యంలో ప్రభుత్వం హడావిడిగా మున్సిపల్ ఎన్నికలకు సిద్ధమవుతుండటం వలన బీసీలు నష్టపోతారని, సర్పంచ్ ఎన్నికల కోసం ముందు కేంద్ర నుంచి రావాల్సిన నిధులు కోసం హడావిడిగా 42 శాతం రిజర్వేషన్లు కల్పించకుండా సర్పంచ్ ఎన్నికలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి ముసిపట్ల లక్ష్మీనారాయణ, బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు జాజాల రమేష్, బీసీ నాయకులు యాగండ్ల రమేష్ గౌడ్ , బోగ రమేష్ , స్తంభం కాడి శ్యామ్ ప్రశాంత్ పాల్గొన్నారు. జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి ఎలుక భగవాన్ యాదవ్, బిసి యూత్ కో-ఆర్డినేటర్ హృషికేష్, బిసి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# 25వ వార్డ్ కు చెందిన పలువురు బిజెపిలో చేరిక



**జగిత్యాల జనవరి 21 (ప్రజా మంటలు)** : పట్టణ 25వ వార్డ్ కి చెందిన గుండేటి సాయి మరియు 25 వార్డ్ సభ్యులు కేంద్ర ప్రభుత్వం మరియు నరేంద్ర మోడీ అమలు చేస్తున్న అభివృద్ధి మరియు సంక్షేమ పథకాలకు ఆకర్షితులై భారతీయ జనతా పార్టీలో చేరగా వారికి భారతీయ జనతా పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించిన బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు డా. బోగ శ్రావణి ఈ కార్యక్రమంలో జగిత్యాల పట్టణ అధ్యక్షులు కొక్కు గంగాధర్, పట్టణ ప్రధాన కార్యదర్శి ఆముదరాజు, మ్యాన మహేష్,కొప్పు భాస్కర్,కాశేటి తిరుపతి,బోగ రాజు కుమార్,గుండేటి గోపి,మ్యాన సాయివరుణ్, దీపక్, మాధవన్, రాజు, వినయ్, సునీల్, గణేష్, నరేష్, వంశీ, మనోహర్, ప్రవీణ్, రాహుల్, సాయి, రాజేష్,తరుణ్,జయంత్,గంగాధర్,గణేష్,పవన్,కృష్ణ చారి, సుశీల్, మహేష్, దేవదాస్, సాయి చరణ్, లక్ష్మీ రాజవ్వ,పద్మ,రవి,స్వప్న,ప్రమీల,రజిత,మనోజ్,శివ,వెంకటేష్ మరియు ముఖ్య నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యలను వెతికితీస్తూ ప్రజల పక్షాన నిలిచే ఏకైక దినపత్రిక తెలంగాణ గళం

**క్యాలెండర్ ఆవిష్కరణలో ఎల్కతుర్తి మండలం సీఐ ఎస్ఐ ఎంపీడీవో**






**ఎల్కతుర్తి జనవరి 21 ప్రజా మంటలు :** ప్రజా సమస్యలను వెతికితీస్తూ, అక్షరాల రూపంలో వెలుగులోకి తీసుకొని వస్తున్నా ఏకైక దినపత్రిక తెలంగాణ గళం అని ఎల్కతుర్తి మండలం సీఐ అన్నారు. తెలంగాణ గలం - 2026 నూతన సంవత్సర క్యాలెండర్ సీఐ ఆవిష్కరించారు.

**సీఐ (పులి రమేష్) మాట్లాడుతూ**

తెలంగాణ రాష్ట్రంలో నిజాలను బయటకు తీస్తూ ప్రజల పక్షాన నిలుస్తుందని అన్నారు. ప్రస్తుత సమాజంలో ప్రజల సమస్యల పరిష్కారం కోసం పనిచేస్తూ, ప్రభుత్వ విధానాలను ప్రచురిస్తూ, అభివృద్ధి కోసం ప్రజల తరపున కృషి చేస్తుందన్నారు..

**ఎస్సై ప్రవీణ్ మాట్లాడుతూ:**

ప్రజలకు- ప్రభుత్వానికి మధ్య వారధిగా ఉంటున్న మీడియా ప్రజలకు సమాచారంతోపాటు సమాజంలో జరుగుతున్న పరిణామాలను స్పష్టంగా తెలియజేయడంలో మీడియా పాత్ర ఎంతో కీలకమని ఈ సందర్భంగా తెలియజేశారు ..

PRINTED AND PUBLISHED BY V.NARSINGAM, ON BEHALF OF CH.V. PRABHAKAR RAO AND PRINTED AT SRI S HARADHA OFFSET PRINTERS. H.NO.9-14/8/3, BUGGARAM VILLAGE AND MANDAL, BUGGARAM GRAMAPANCHAYATH- 505454, JAGTIAL DISTRICT, TELANGANA STATE.. PUBLISHED AT 6-6-206,PADMA NAGAR, JAGTIAL - 505327, JAGTIAL DISTRICT, TELANGANA STATE. EDITOR : CH V. PRABHAKAR RAO, RNI . TELTEL/2021/81092 : PHONE : 9391533339 EMAIL: prajamantalu@gmail.com